తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు అడ్వర్టైజ్మెంట్స్ మరియు వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 210 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | శనివారం 04 జనవరి - 2025 | పేజీలు : 8 | వెల : 04/-

# ఈ ప్రభుత్వం కష్టకాలంలో బాధ్యతలు చేపట్టింది

## ప్రభుత్వానికి ఆదాయం లేకుండా పోయింది...
## ప్రతి నెల వస్తోన్న రాబడి సరిపోవడం లేదు




- ప్రతి నెలా రూ.18,500 కోట్ల ఆదాయం వస్తోంది.. కనీస అవసరాలకే రూ.22,500 కోట్లు కావాలన్న సీఎం
- సమస్యల పరిష్కారానికి ధర్నాలే అవసరం లేదు... చర్చల ద్వారా పరిష్కారమవుతాయన్న సీఎం
- సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అవకాశం లేదని స్పష్టీకరణ
- రెగ్యులరైజ్ కోసం పట్టుబడితే సమస్య పెరుగుతుందన్న సీఎం

**శాసనసభ / హైదరాబాద్ :** ప్రభుత్వానికి ఆదాయం లేకుండా పోయిందని, ప్రతి నెల వస్తోన్న రాబడి సరిపోవడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిలో మార్పులు తీసుకురావడానికి కాస్త సమయం పడుతుందన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామన్నారు. ఆర్థిక పరిస్థితుల వల్ల కొన్ని సమస్యలను పరిష్కరించ లేకపోతున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం లేకుండా పోయిందని,దీంతో పలు సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నట్లు చెప్పారు.ప్రతి నెలా ప్రభుత్వానికి రూ.18,500 కోట్ల ఆదాయం వస్తోందని, అది సరిపోవడం లేదన్నారు. కనీస అవసరాలకే ప్రతి నెల రూ.22,500 కోట్లు కావాలన్నారు. ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు తీసుకు రావడానికి ఇంకాస్త సమయం పడుతుందన్నారు.ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరిస్తామన్నారు.

మిగతా »»4లో

## కిలో టమాటా రూ.2...
## గిట్టుబాటు ధర లేక 4 ఎకరాల పంటకు
## నిప్పంటించిన రైతు




- నాలుగు ఎకరాల్లో టమాటా వేసిన మెదక్ జిల్లా నవాబ్‌పేట రైతు
- 25 కిలోల టమాటా బుట్ట ధర కేవలం రూ.50
- కిలో రూ.2 పలుకుతున్న టమాటా ధర
- రవాణా ఖర్చులు కూడా రావడం లేదని ఆందోళన

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణలో టమాటాకు గిట్టుబాటు ధర లేక చాలామంది రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లాలో అయితే టమాటాకు గిట్టుబాటు ధర లేకపోవడంతో ఓ రైతు తన పొలంలోని టమాటా పంటను తగులబెట్టేశాడు. మొన్నటి వరకు 25 కిలోలు కలిగిన టమాటా బుట్ట ధర రూ.600 నుంచి 1,200 వరకు పలిగిన రోజులు ఉన్నాయి. కానీ ఇప్పుడు అదే బుట్టకు కనీసం రూ.100 కూడా రావడం లేదు.మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలం నవాబ్‌పేటకు చెందిన రైతు రవి గౌడ్ నాలుగు ఎకరాల్లో టమాటా సాగు చేశాడు. పంటను మార్కెట్‌కు తీసుకు వెళితే 25 కిలోల బుట్ట రూ.50 పలుకుతోంది.అంటే కిలో రూ.2 మాత్రమే పలుకుతోంది.దీంతో అతను తన నాలుగు ఎకరాల్లోని టమాటా పంటకు నిప్పు పెట్టాడు.

## ఎన్నికల సమయంలోనే బీఆర్ఎస్ నేతలు బీసీల గురించి మాట్లాడుతున్నారు

- బీఆర్ఎస్ పాలనలో బీసీలకు ఏమాత్రం గౌరవం దక్కలేదని విమర్శ
- అధికారంలో ఉన్నన్నాళ్లు బీసీలు గుర్తుకు రాలేదని మండిపాటు
- పదేళ్ళు బీసీలకు ఏం చేసిందో చెప్పాలని నిలదీత




**శాసనసభ/ హైదరాబాద్ :** ఎన్నికల సమయంలోనే బీఆర్ఎస్ నేతలు బీసీల గురించి మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ...బీఆర్ఎస్ పాలనలో బీసీలకు ఏమాత్రం గౌరవం దక్కలేదన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లు బీఆర్ఎస్ నేతలకు బీసీలు గుర్తుకు రాలేదని, ఇప్పుడు మాత్రం వారి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

## రేవంత్ రెడ్డి ప్రజాదర్బార్‌కు ఒకేరోజు హాజరయ్యారు

- సీఎంతో పాటు మంత్రులు కూడా హాజరు కావడం లేదని విమర్శ
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో తూతూ మంత్రంగా ప్రజావాణి నిర్వహిస్తున్నారని విమర్శ
- దరఖాస్తులు సమర్పించడం వృథానే అన్న హరీశ్ రావు



**శాసనసభ/ హైదరాబాద్ :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాదర్బార్‌కు ఒకే ఒకరోజు హాజరై... 10 నిమిషాలు మాత్రమే ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారని... దీనిని బట్టే ప్రజాదర్బార్ పట్ల సీఎంకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో వెల్లడైందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సీఎం కార్యాలయంలో ప్రతిరోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తామని కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టోలో డబ్బా కొట్టిందన్నారు. ప్రజాదర్బార్‌ను నిర్వహించకపోగా పేరు మార్చి ప్రజావాణిగా చేశారన్నారు.

మిగతా »»4లో

## నా కోసం నేనో ఇల్లు కట్టుకోలేదనే విషయం దేశానికి తెలుసు




- గత పదేళ్లలో పేదల కోసం 4 కోట్ల ఇళ్లు కట్టామన్న మోదీ
- మేం అద్దాల మేడలో ఉండటం లేదన్న ప్రధాని
- పదేళ్లుగా ఢిల్లీని ఓ విపత్తు చుట్టుకుందన్న ప్రధాని
- బీజేపీలోనే అసలైన విపత్తు ఉందన్న కేజ్రీవాల్

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

- ఫార్ములా ఈ-రేసింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ఏసీబీ
- ఈ నెల 6న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశం
- దాన కిశోర్ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా దర్యాప్తు చేస్తోన్న ఏసీబీ



**శాసనసభ/ హైదరాబాద్ :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ-రేసింగ్ కేసును ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.ఈ క్రమంలో ఈ నెల 6న ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాలని ఏసీబీ నోటీసుల్లో పేర్కొంది. అంటే వచ్చే సోమవారం కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది.బీఆర్ఎస్ హయాం లో తెలంగాణ మున్సిపల్ శాఖ, ఫార్ములా ఈ-ఆపరేషన్స్ లిమిటెడ్ మధ్య జరిగిన ఒప్పందం, అందులో చోటు చేసుకున్న ఉల్లంఘనలపై అధ్యయనం చేస్తోంది.

మిగతా »»4లో

## నాంపల్లిలో మొదలైన 'నుమాయిష్' సందడి

**శాసనసభ / హైదరాబాద్ :** నాంపల్లిలో నుమాయిష్ సందడి మొదలైంది. ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 84వ అఖిల భారత వస్తు పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్)ను రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. 1938లో నిజాం కాలంలో మొదలైన నుమాయిష్‌కు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి సందర్శకులు వస్తారు. సందర్శకుల సౌకర్యార్థం ఎగ్జిబిషన్ సొసైటీ గాంధీభవన్, అజంతా, గోషామహల్ గేట్‌లను అందుబాటులో ఉంచింది. సీసీ కెమెరాలు, భద్రతా బలగాలతో పాటు.. సందర్శకులు మైదానంలో తిరిగేందుకు ఏర్పాట్లు చేశారు. జమ్మూకశ్మీర్ డ్రై ఫ్రూట్స్, హ్యాండ్ క్రాఫ్ట్స్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి హస్తకళ వస్తువులు ప్రదర్శనలో ఉంటాయి. దేశంలోని అత్యుత్తమ బ్రాండ్ల ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు అన్ని రకాల స్టాల్స్ అందుబాటులో ఉంటాయి. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు, వారాంతాలు, సెలవు రోజుల్లో రాత్రి 11 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



## రెండు రాష్ట్రాల ప్రజలకు మేలు జరగాలని కోరుకున్నానన్న అరుణ



మిగతా »»4లో

## రెండు జాతీయ పార్టీలు బీసీలకు తీరని అన్యాయం చేశాయన్న కవిత




## కొత్త వైరస్ కథనాలపై స్పందించిన చైనా



శాసనసభ
శనివారం 04 జనవరి - 2025

# అన్నదమ్ముల్లా ఉండాల్సిన మనం ఆగమైపోవద్దు..!




తెలంగాణ రాష్ట్రంలోని 31 మంది మాల మేధావులు తేదీ 17-12-2024న ఆంధ్రజ్యోతి పత్రికలో రిజర్వేషన్లను శాస్త్రీయ బద్ధంగా వర్గీకరించాలని ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా సంతోషం.వర్గీకరణ కావాలని ఈ మేధావులంతా అభిప్రాయ పడటం మంచి విషయం.దీనిని అందరూ ఆహ్వానించాల్సిందే.

ఈ మేధావులు తెలుగు రాష్ట్రాల్లో పేరు ఎన్నిక కలిగిన అంబేద్కర్ వాద ప్రముఖులు.అంతేకాదు వీరిలో కొందరు వామపక్ష అభ్యుదయ ప్రజాతంత్ర లౌకిక బహుజన భావజాలం కలిగిన మేధావులుగా పేరుపొందారు.

తాను ఒక కులానికి ప్రతి నిదినని అంబేద్కర్ ఏనాడు ప్రకటించుకోలేదు. మొత్తం నిమ్న జాతుల,అస్పృశ్యుల ప్రతినిధిగా ప్రకటించుకొని లండన్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నాడు.కులాల పుట్టుకకు మూలమైన హిందూమతంలో తాను పుట్టినా హిందువుగా చావనని ప్రకటించి అమలు చేసాడు.నిమ్న జాతుల కోసం,అణగారిన ప్రజల కోసం, అట్టడుగు వర్గాల దళితుల కోసం తన జీవితాన్ని ధార పోశాడు. నేడు మనువాద మతోన్మాదులు కులాల కుంపట్లు రాజేస్తున్నారు. కుల నిర్మూలన కోసం జీవితాన్ని ధారపోసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వారసులు ఎవరైనా,ముఖ్యంగా మాల మాదిగ మేధావులు దళితు లందరి ప్రతినిధులుగా ఉండాలి. బహుజన, వామపక్ష మేధావులు,ఉద్యమకారులెవరైనా,ఒక కులంలో పుట్టినప్పటికీ ఆ కులానికే ప్రతినిధులుగా కాకుండా నిమ్న జాతులు,అంటరాని దళితులందరికీ ప్రతినిధులుగా ఉండాలని నేను కోరుకుంటున్నాను.

30 సంవత్సరాల వర్గీకరణ పోరాటానికి ఆగస్టు ఒకటి 2024న సుప్రీంకోర్టు తీర్పుతో ఒక పరిష్కారం దొరికింది. సుప్రీంకోర్టు తీర్పును అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని మాదిగ సోదరులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నారు. తమ పోరాట ఫలితంగా ఎంతో కొంత తమకు మేలు జరుగుతుందని మాదిగలు ఆశిస్తున్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వర్గీకరణ అమలు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఈ దశలో వర్గీకరణ తీర్పు రాజ్యాంగానికి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలకు వ్యతిరేకమనీ,దళితుల ఐక్యతకు విఘాతం కలిగిస్తుందనీ,అందుకని వర్గీకరణ నిలుపుదల చేయాలని మాల సోదరులు సింహగర్జన నిర్వహించారు.మాల మాదిగల లోని కొందరు నాయకుల రెచ్చగొట్టే ప్రకటనలు,చర్యల వల్ల మాల మాదిగల మధ్య ఘర్షణ తీవ్రమవుతుంది.శత్రు పూరిత వాతావరణం ఏర్పడింది. ఈ ఇలాంటి వాతావరణంలో మాల మాదిగల మధ్య సయోధ్య శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పి, ఐక్యం చేయాల్సి నటువంటి బాధ్యత ఇరు కులాల మేధావులపై ఉంది.

వర్గీకరణ వద్దనీ, జరగాలనీ గత 30 సంవత్సరాలలో అనేక చర్చలు, సిద్ధాంత రాద్ధాంతా లు అన్ని రకాల ఆందోళనలు పోరాటాలు జరిగాయి. ఇరు కులాల వారు పోరాడిఅలిసిపోయిన సందర్భంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.ఈ తీర్పుపై చాలామంది మాల సోదరులు రివ్యూ పిటిషన్ వేశారు.తీర్పును వ్యతిరేకిస్తున్న వారు నేడు చేస్తున్న వాదన లన్నింటినీ ఆ పిటిషన్ లో పేర్కొన్నారు.కానీ రివ్యూ పిటిషన్లు అన్నింటిని సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ పరిస్థితుల్లో మన రాష్ట్రంలో పేరు కలిగిన 31 మంది మాల మేధావుల ప్రకటన చేయడం ఏలాంటి సంకేతాన్ని ఇస్తుంది. అది మాదిగలకు వ్యతిరేకమని భావించడానికి ఆస్కారం కలిగిస్తుంది. తీరా తిన బోయే ముందు కొంచెం ఆగండి అందరం కలిసి శాస్త్రీయంగా పంచుకొని తిందాం అంటే అర్థం ఏమిటి? ఆ శాస్త్రీయంగా ఎవరు పంచాలి, ఎప్పుడు పంచాలి, దానికి ఎంత కాలం కావాలి అని ఎవరైనా చెప్ప గలుగుతారా? ఇలా చెప్పటం అంటే రిజర్వేషన్ల ను బలపరుస్తున్నట్టే కనిపిస్తూ వ్యతిరేకించటమే అని ఎవరైనా ముఖ్యంగా మాదిగలు అపార్థం చేసుకుంటారు. అది మాల మేధావులకు మంచిది కాదు

**- మాల మేధావులు వర్గీకరణకు అనుకూలమే కానీ....**

ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు తాము అనుకూలమే అని రాశారు. కానీ అదే సమయంలో సుప్రీంకోర్టు వర్గీకరణ తీర్పు ఆర్టికల్ 341 కి వ్యతిరేకమని కూడా చెప్పారు. అంతేకాకుండా ఉప కులాల వర్గీకరణ శాస్త్రీయంగా జరగాలన్నారు. ఆ శాస్త్రీయత ఏమిటో , బి లో మాలలు వారి ఉప కులాలు ఉండాలని చెప్పిన వీరు ఏ.సీ.డీ లలో ఎవరు ఉండాలో చెప్పలేదు.

**- ఆర్టికల్ 341 ఏం చెప్పింది..?**

**1950 ఆర్టికల్ 341 ఈ క్రింది విధంగా చెప్పింది.**

"రాష్ట్రపతి రాష్ట్ర గవర్నర్ లేదా రాజ ప్రముఖతో సంప్రదించిన తర్వాత పబ్లిక్ నోటిఫికేషన్ ద్వారా ఈ రాజ్యాంగం యొక్క ప్రయోజనాల కోసం పరిగణించబడే కులాలు జాతులు లేదా తెగలలోని కులాలు జాతులు లేదా తెగలు లేదా సమూహాలను పేర్కొనవచ్చు ఆ రాష్ట్రానికి సంబంధించిన షెడ్యూల్డ్ కులాలుగా ఉండాలి"

అనగా 1950 ఆర్టికల్ 341 ప్రకారం ఒక కులాన్ని తీసివేయడం కానీ మరో కొత్త కులాన్ని చేర్చడం గానీ లేదు. ఈ ఆర్టికల్ లో ఉన్న కులాల్లోని వారికి రాజ్యాంగ ప్రయోజనాలు అనగా రిజర్వేషన్లు సమానంగా అనుభవించే హక్కు అందరికీ ఉండాలి.అదే సామాజిక న్యాయం, సమన్యాయం. ఆర్టికల్ 14 ఆర్టికల్ 15 క్లాస్ 4 ప్రకారం కూడా ఉప కులాల వర్గీకరణ అమలు చేయడం రాజ్యాంగానికి లోబడి ఉందనే విషయం స్పష్టమవుతుంది.

**- మాల మేధావుల ప్రకటనలోని మూడు ప్రధాన అంశాలు**

**- మొదటి పాయింట్ లోనే**

ఎస్సీ వర్గీకరణ ఆర్టికల్ 341 కి వ్యతిరేకం అని ప్రకటనలో పేర్కొనడం ద్వారానే వర్గీకరణకు వీరు వ్యతిరేకం అని చెప్పకనే చెప్తున్నారు.వర్గీకరణ ఆర్టికల్ 341 విరుద్ధమా, అనుకూలమా అని ఎవరు తేల్చాలి. చట్టసభలు తేల్చాలి లేదా కోర్టులైనా తేల్చాలి. చట్టసభల్లో ఉండే పాలకవర్గాల ప్రతినిధులైన పార్లమెంట్ సభ్యులు ఈ సమస్యకు పరిష్కారం చూపించరు. వాళ్లకు ఎంత కాలం ఈ సమస్య ఉంటే అంతకాలం మంచిది. కనుక చాలా సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించనట్టే ఈ సమస్య కూడా వారు పరిష్కారం చూపించరు.

ఎస్సీ వర్గీకరణ జరగాలనే 30 సంవత్సరాల పోరాటానికి ఆగస్టు ఒకటి 2024న ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఏదో విధంగా తీర్పునిచ్చింది. ఆయా రాష్ట్రాలు ఎస్సీ ఉప వర్గీకరణ చేసుకోవచ్చని భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. ఈ తీర్పు సరైనది కాదనీ, రాజ్యాంగ వ్యతిరేకమనీ,రాష్ట్రాలకు ఆ అధికారం లేదనీ ఎవరు భావించినా మళ్లీ కోర్టుకు వెళ్ళవచ్చును. అందులో తప్పులేదు. అంతేకాదు తాము న్యాయం అనుకున్నా సమస్యను పరిష్కరించుకోవడం కోసం ఘర్షణలకు తావివ్వకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేయవచ్చును

కానీ జరుగుతున్నది ఏమిటి మాల మాదిగల మధ్య పూడ్చలేని అగాదం ఏర్పడుతుంది. ఒకరిపై ఒకరు విద్వేషపూరిత ప్రకటనలు చేస్తున్నారు. పాటలు, మాటలు, సింహగర్జనలు వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. పాలక పార్టీల రెండు కులాల ప్రజా ప్రతినిధులు మాల మాదిగల మధ్య మంట పెట్టి వేడి పెంచుతున్నారు. దురదృష్ట వశాత్తు మేధావులైన వారు దళితులలో ఐక్యత పెంపొందించాల్సింది పోయి తమ తమ కులాలకు పరిమితమై ప్రకటనలిస్తున్నారు.

- రెండవలి పాయింట్ లో "వర్గీకరణ ఆర్టికల్ 341 కి వ్యతిరేకమయినప్పటికీ ఉప వర్గీకరణ చేసి ఎస్సీ కులాలలోని అర్హులైన సమూహాలకు సామాజిక న్యాయం చేకూర్చాలనే వాదనను సమర్థిస్తున్నాం".అని ఈ మేధావులు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వీరు పేర్కొన్న దానికి ఏమైనా భిన్న మైనదా? కానప్పుడు ఆ తీర్పును బల పరచవచ్చు కదా.

**- మూడవ పాయింట్ :** "ఎస్సీ కులాల జనాభాను నిష్పాక్షికంగా నిర్దిష్టంగా లెక్క కట్టాలన్నారు. ఈ పాయింట్ కింద పేర్కొన్న ఆరు అంశాల ప్రాతిపదికన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేయాలని చెప్పారు". ఇది మంచి విషయం.

అయితే ఈ మూడో పాయింట్ లోని నాలుగో అంశంలో మాల వారి ఉప కులాలను, మాదిగ దాసరులను బి గ్రూప్ లో చేర్చాలని పేర్కొన్నారు.ఏ నిష్పాక్షిక, నిర్దిష్ట లెక్కల ప్రకారం ఈ నిర్ధారణకు వచ్చారు. ఇదే విధంగా మిగతా 59 కులాలను కూడా ఏ సి డి ల కింద వర్గీకరించి ఉంటే సరిపోయేది కదా! మిగతా కులాలలో వర్గీకరణకు ఏ ప్రాతిపదికన తీసుకోవాలో చెప్పారు.మాల కులానికి కూడా ఇది వర్తిస్తుంది కదా. మీరు చెప్పిన ప్రాతిపదికనే నిష్పాక్షిక నిర్దిష్ట లెక్కల ధ్రువీకరణ అనంతరం 59 కులాలను వర్గీకరిస్తే సరిపోతుంది. అయితే ఆ నిస్పాక్షిక నిర్దిష్ట లెక్కలు తేల్చాలని ప్రభుత్వానికి ఒక నిర్దిష్ట సమయం నెల,రెండు నెలల సమయాన్ని పెట్టి ఉంటే బాగుండేది. అలా కాకుండా మీరు మాల కులాన్ని ముందుగా "బీ" లో పెట్టడం మిగతా వాటిని ఎందులో పెట్టకపోవడం నిజాయితీగా,నిష్పక్షపాతంగా లేదు.

**- మేధావి వర్గానికి విజ్ఞప్తి**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వారసులమైన మనం అడుగంటి పోతున్న రిజర్వేషన్ల కోసం పోరాటాలు చేసుకుని విడి పోవద్దు. పెరిగిపోతున్న ప్రైవేటీకరణ ఫలితంగా రిజర్వేషన్లు తరిగి పోతున్నాయి. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు సాధించాల్సిన కర్తవ్యం మన ముందు ఉంది.ఆ మహనీయుని మాట బాట రాజ్యాధికారం. ఆ రాజ్యాధికారం మన చేతిలో ఉంటే రిజర్వేషన్లు కాదు, సకల సమస్యలను పరిష్కరించు కోవచ్చును. సమ సమాజాన్ని నిర్మించు కోవచ్చును.

ఆ రాజ్యాధికారాన్ని సాధించడానికి ముందుగా 59 దళిత కులాలన్నీ ఒకటిగా ఉండాలి. వారి మధ్య ఉండే, వారు ఎదుర్కొనే సమస్యలకు కారణం ప్రభుత్వ విధానాలు తప్ప తోటి దళితుడు, దళిత కులం కాదనే విషయాన్ని గుర్తించాలి.ఎస్ టి, బీ.సీ సోదరులతో మమేకమై బహుజను లంతా ఒక్కటే అనే బహుజన కాన్సెప్ట్ పెంపొందించాలి. వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులతో జత కట్టాలి. అంతిమంగా కుల మత దోపిడి రహిత శ్రమజీవుల రాజ్యాన్ని సాధించాలి. ఇందుకోసం మేధావులు నడుము కట్టాలి. అలా కాకుండా తమకు తాము ఒక కులానికి పరిమిత మవడం బాధాకరం. ఇప్పటికైనా దళితుల ఐక్యత కోసం కార్యాచరణ రూపొందించాలని సామాజిక న్యాయాన్ని కోరుకునే మేధావులు అందరికీ ముఖ్యంగా మాల మాదిగ మేధావులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

**మిత్రులారా.....**

నేను "మార్క్స్ అంబెడ్కర్ లు మన మార్గదర్శకులు" అని భావిస్తున్న వ్యక్తిని. వామపక్షాల ఐక్యత/ విలీనం తక్షణ అవసరంగా భావిస్తున్నాను.లాల్ నీల్ మైత్రి నేటి చారిత్రక అవసరంగా భావిస్తున్నాను. మనువాద మతోన్మాద భావజాల వ్యతిరేక పోరాటం మనందరి కీలక కర్తవ్యంగా ఉండాలని భావిస్తున్నాను.



**- బొజ్జ బిక్షమయ్య**
**సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు**

# మెదక్ కాథెడ్రల్ చర్చ్

## - తెలంగాణలోని గొథిక్ అద్భుతం




తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ లో ఉన్న కాథెడ్రల్ చర్చ్ చారిత్రక, ఆధ్యాత్మిక, వాస్తు శిల్ప కళా రీతుల్లో నిలచిన అత్యద్భుత కట్టడం.ఇది ఆసియాలోనే అతిపెద్ద చర్చిలలో ఒకటి దీనిని గొథిక్ రివైవల్ శైలిలో నిర్మించిన అతి గొప్ప శిల్పకళాఖండం.

**చారిత్రక నేపథ్యం :** 20వ శతాబ్దం ప్రారంభంలో మెదక్‌లో వినాశనకరమైన క్షామం వచ్చింది. ఆ సమయంలో, బ్రిటీష్ వెస్లీయన్ మిషన్‌కు చెందిన రేవరెండ్ చార్లెస్ వాకర్ పాస్నెట్ ఈ అద్భుత చర్చిని గొప్ప కళా ఖండంగా నిర్మాణాన్ని ప్రారంభి ంచారు.మెదక్ స్థానిక ప్రజలకు కరువు కాటకంతో అలమటించే ప్రజలకు ఉపాధి కల్పిస్తూ ఈ నిర్మాణం జరిగింది, ప్రజల బ్రతుకుల్లో ఆశ నింపే ప్రయత్నంలో,ఒక దశాబ్దం పాటు నిర్విరామంగా చేసిన కృషి ఫలితమే ఈ నిర్మాణం. 1924 డిసెంబర్ 25న చర్చిని ఆరాధనా స్థలంగా మార్చివేసింది.



**- డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**సెల్ : 9849328496**

**ఈ చర్చి వాస్తు ప్రత్యేకతలు :** గొథిక్ రివైవల్ ఆర్కిటెక్చర్ త్రికోణాకార గోపురాలు, సున్నితమైన తలుపులు, కురుపతికలు ఈ చర్చిని ప్రత్యేకంగా నిలబెడతాయి.దీని భూమి విస్తీర్ణం 200 అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పుతో, 5,000 మంది కూర్చుని ప్రార్ధనలు చేసుకొనే సామర్థ్యం తో నిర్మించటమే ఈ చర్చి గొప్పదనంగా స్ఫురింప జేస్తుంది.అలాగే ఈ చర్చి లోపల సౌండ్ప్రూఫ్ రూఫ్ పంచదారపు కణితితో తయారైన ఈ మేడ, ధ్వనిని సరిగా విరుచుకునేలా చేస్తుంది. స్టైన్డ్ గ్లాస్ విండోస్ ఇంగ్లాండ్‌కు చెందిన సర్ ఓ. సాలిస్బరీ రూపొందించిన ఈ కిటికీలు,నేటివిటీ, క్రూసిఫిక్షన్, ఆసెన్షన్ వంటి బైబిల్ దృశ్యాలను చూపిస్తాయి మొసాయిక్ ఫ్లోరింగ్ మరియు అల్టార్ ఇంగ్లాండ్ నుంచి తెచ్చిన మొసాయిక్ టైల్స్,చర్చికి అందాన్ని పెంచాయి.అల్టార్,పల్పిట్ కూడా దానివంటి ప్రత్యేకతను కలిగి ఉన్నాయి.ఆర్గన్ మరియు బెల్ టవర్, శతాబ్దం పాత ఆర్గన్, 175 అడుగుల బెల్ టవర్ చర్చి చరిత్రకు ప్రాముఖ్యతను జోడిస్తాయి. ఇంకా ఈ చర్చిలో చూడవలసినవి అనేకం ఉన్నాయి.నేవ్ మరియు ఆయిల్స్ గొప్ప కాలమ్స్, చిత్రాలు చూడదగినవి. బాప్టిస్మల్ ఫాంట్ పుణ్య కార్యాలకు ఉపయోగించే మార్బుల్ ఫాంట్. లైటింగ్ విషయానికి వస్తే పాతకాలపు ఛాండిలి యర్స్, ఆహ్లాదకరమైన ప్రకాశం అందిస్తాయి. ఈ చర్చి ప్రాముఖ్యత గురించి చెప్పాలంటే మెదక్ కాథెడ్రల్ సంస్కృతి,ఐక్యత,చరిత్రకు ప్రతీక. ఇక్కడ ఆత్మశాంతి కోరే భక్తులకు చక్కటి నమ్మకం, విశ్వాసం ప్రశాతతను ఈ చర్చి పరిసర వాతావరణంలో లభిస్తుంది.చుట్టుపక్కల ప్రదేశాల లో మెదక్ రిజర్వాయర్ ఉంది.అక్కడ స్థానిక కళాకృతులు అనేకం చూడవచ్చు. మెదక్ కాథెడ్రల్ చర్చి ఆధ్యాత్మికతకు ప్రతీక,అత్యద్భుత ఆశయం, చరిత్ర కలిగి, కళలకు కాణాచిగా ప్రాచీన శిల్ప నిర్మాణ రీతికి ప్రతీకగా ఉంది. ఇది తెలంగాణ చరిత్తకు,సంస్కృతికి,మత సామరస్యతకు మరచి పోలేని అద్భుత కళా సంపదకు ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. ప్రతి ఏటా వేలాది మంది భక్తులు, లక్షలాది మంది టూరిస్టులు ఈ గొప్ప కళాఖండాన్ని చూసి తరిస్తారు.

# అమ్మ రా..నిను కన్న తల్లిరా.!

పల్లవి : అమ్మ రా నిను కన్న తల్లి రా
నీకు ప్రాణం పోసిన దైవమురా.. 2

**చరణం1:**
నివు కడుపులో ఉన్నప్పుడు
నీ చిన్ని కాళ్లతో తన్నప్పుడు
పురిటి నొప్పుల బాధ మరిచెను
నీ మొహము చూసినప్పుడు
నీవు బుడి బుడి అడుగులేసి
రోజూ బడికి వెళుతుంటే
అక్షరాలను చూసి లక్ష్యం చేరే
ధైర్యం ఇచ్చేనురా..
"అమ్మ రా 2"

**చరణం 2 :**
నీకు ఆకలవుతుంటే
ఆకలంటుంటే
పస్తులవుండి నీ కడుపు నింపిన నీ కన్న తల్లి రా
నువు బయటకెళుతుంటే
నీ తల్లి దేవున్నె మొక్కేనురా..
నా కొడుకు యాడున్నా
మళ్లీ చల్లగా తిరిగి రావాలని..
"అమ్మ రా2"

**చరణం 3 :**
నీ పిల్లా పాపలతో కలిసి ఆడాలని
ఎన్నెన్ని ఆశలు తన మదిలో ఉండునురా
తన ఆశలే మార్చి పోయి నీ బాధ్యత మర్చిపోయి
నిను కన్న తల్లిని లెక్క చేయకుండా
రోడ్డున వేస్తారురా..
"అమ్మ రా2"

**చరణం 4 :**
తనకు చావే ఎదురైనా..
తన ప్రాణమే పోయినా
నిను కన్న తల్లి ఎప్పుడు నీ బాగోగు చూస్తాదిరా..
నివు ఎక్కడున్నా.. నీ పిల్లా పాపలతో
చల్లగా ఉండనీ ప్రేమగా దీవించే అమ్మ రా..
అమ్మ ప్రేమే గొప్పది రా..
అమ్మ రా..2



**నేనావత్ భాగ్య**
**ఇంటర్ సెకండియర్, బైపీసీ**
**టీజీ టీడబ్ల్యూయూఆర్జేసీ(గర్ల్స్), (పీవీటీజీ), అచ్చంపేట మండలం, ఐనోలు గ్రామం, నాగర్ కర్నూలు జిల్లా**

# కేటీఆర్ రేపో మాపో అరెస్టు అవుతారు



**శాసనసభ / హైదరాబాద్:** బీఆర్ఎస్ పై, కేసీఆర్ కుటుంబంపై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్యే కడియం శ్రీహరి. ఇవాళ జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్‌లో గ్రామస్తులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖాముఖి నిర్వహించారు.ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కవిత ఇప్పటికే జైలుకు వెళ్లివచ్చింది.. కేటీఆర్ రేపో మాపో అరెస్టు అవుతారన్నారు. హరీష్ రావు, కేసీఆర్ కూడా కాళేశ్వరం ప్రాజెక్టు విచారణలో కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కుటుంబం పది సంవత్సరాల పాలనలో. కొత్త రకమైన అవినీతికి తెరలేపిందని, సాక్షాత్తు కేసీఆర్ బిడ్డ.. లిక్కర్ కుంభకోణంలో ఎన్ని రోజులు తీహార్ జైల్లో ఉందో అందరికీ తెలిసిందే అని ఆయన వ్యాఖ్యానించారు. రేపో, మాపో ఫార్ములా ఇ రేసులో కేటీఆర్ జైలుకు పోవడం ఖాయమని కడియం శ్రీహరి ఉద్ఘాటించారు. అంతేకాకుండా..' కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ పూర్తికాగానే.. కెసిఆర్ తో పాటు హరీష్ రావు కూడా జైలుకి వెళ్లాల్సిందే. కల్వకుంట్ల కుటుంబం వివిధ కేసుల్లో ఇరుక్కుని.. కొందరు జైలు ఊచలు లెక్కపెట్టి వస్తే. మరికొందరు జైలు ఊచలు లెక్క పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి 2014 కు ముందు ఉన్న ఆస్తులు%ొ% ఇప్పుడు ఉన్న ఆస్తులు ఎంతో ప్రకటించాలి. దళిత బందులో కమిషన్ తీసుకున్నవారు.. నీతులు మాట్లాడడం హాస్యాస్పదం. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు నీతులు మాట్లాడడం విడ్డూరం.. కడియం శ్రీహరి తప్పు చేస్తే ఆధారాలు చూపించండి.. ఇకనైనా సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలి..' అని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు.

# వెల్లుల్లి చేసే ఆరోగ్య అద్భుతాలు తెలిస్తే రోజూ తింటారు!



వెల్లుల్లి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా చలి కాలంలో వెల్లుల్లి తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. చలికాలంలో మనకు త్వరగా అనారోగ్య సమస్యలు వస్తాయి. రకరకాల ఇన్ఫెక్షన్లు మనలను ఇబ్బంది పెడతాయి. అయితే చలికాల ంలో వచ్చే అనేక అనారోగ్య సమస్యలకు వెల్లుల్లి మంచి పరిష్కారాన్ని చూపిస్తుంది. వెల్లుల్లి మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొం దించుకోవడానికి ఎంతో బాగా ఉపయోగపడుతుంది.

**వెల్లుల్లితో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు**

వెల్లుల్లిలోని అలిసిన్ అనే యాంటీ బ్యాక్టీరియల్ కాంపోనెంట్ మన శరీరంలో రోగనిరోధక శక్తిని బాగా పెంచుతుంది. వెల్లుల్లి తింటే మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గిపోతుంది. వెల్లుల్లిలో అలిసిన్ ఉండడం వల్ల ఇది మన గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ప్రతీరోజూ రెండు వెల్లుల్లి రెబ్బలను ఉదయాన్నే తినేవారు గుండె పోటుకు గురి కారు.

**వెల్లుల్లితో బీపీ, కొలెస్ట్రాల్ లకు చెక్**

వెల్లుల్లిలో కర్కుమిన్ అనే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి అనేక దీర్ఘకాలిక వ్యాధుల నుండి కాపాడుతుంది. వెల్లుల్లి మన బీపీని కూడా కంట్రోల్ చేసి కొలెస్ట్రాల్ స్థాయిలను నార్మల్ గా ఉండేలా చేస్తుంది. వెల్లుల్లితో ఇన్ఫ్లమేషన్ బాగా తగ్గుతుంది. ఇది మన కీళ్లనొప్పుల నివారణకు ఎంతో బాగా ఉపయోగపడుతుంది. వెల్లుల్లిలో ఉండే గుణాలు మన శరీరంలో ఫ్రీ రాడికల్స్ తో పోరాడతాయి.

**వెల్లుల్లితో ట్రైగ్లిజరైడ్స్ కు చెక్**

వెల్లుల్లి ఊపిరితిత్తులకు మంచి చేస్తుంది. ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ ఉన్నవారికి వెల్లుల్లి ఎంతో బాగా పనిచేస్తుంది. వెల్లుల్లిలో విటమిన్ సి, విటమిన్ b6, మాంగనీస్, సెలీనియం అధికంగా ఉంటాయి. ఇవి మన శరీర ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయి. వెల్లుల్లి మన రక్తంలోని ట్రై గ్లిజరైడ్స్‌ను తగ్గిస్తాయి. వెల్లుల్లిని మూడు రోజులపాటు తేనెలో నానబెట్టి ప్రతిరోజు ఉదయం 3 వెల్లుల్లి రెబ్బలను తింటే ట్రైగ్లిజరైడ్స్ బాగా తగ్గుతాయని చెబుతారు.

**వెల్లుల్లి మితంగా రోజూ తీసుకుంటేనే ఫలితం**

ఇక మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చే వెల్లుల్లి ప్రతిరోజు తీసుకోవడం మంచిది. అయితే వెల్లుల్లి అధిక మొత్తంలో తీసుకుంటే మాత్రం జీర్ణక్రియ సమస్యలు, అలర్జీలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి వెల్లుల్లిని పరిమితంగా ప్రతిరోజు ఒక క్రమ పద్ధతిలో తీసుకోవడం మంచిది.

# పొద్దుతిరుగుడు నూనెను వంటల్లో వాడుతున్నారా? ఇది ఆరోగ్యానికి మంచిదేనా?

పొద్దుతిరుగుడు నూనె వంటకాల్లో ప్రధానంగా ఉపయోగించ బడుతున్న నూనెల్లో ఒకటి. ఇది రుచికి మంచిదే కాదు, ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. కానీ దానిని ఉపయోగించే విధానం, పరిమాణం ఆరోగ్యంపై కీలక ప్రభావం చూపుతుంది. అన్ని నూనెల మాదిరిగానే, పొద్దుతిరుగుడు నూనెను కూడా మితంగానే తీసుకోవాలి.

**పొద్దుతిరుగుడు నూనె యొక్క ప్రయోజనాలు:**



పొద్దుతిరుగుడు నూనెలో విటమిన్ E,K ఎక్కువగా ఉంటాయి. విటమిన్ E శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పని చేస్తూ చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ నూనెను ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో పాలీఅన్ సెచ్యురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు, మోనోఅన్ సెచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి, ఇవి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. పొద్దుతిరుగుడు నూనెలో ఉండే విటమిన్ E, యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని కణాలను నష్టం నుండి రక్షిస్తాయి. చర్మాన్ని మాయిశ్చ రైజ్ చేసి,మృదువుగా చేస్తుంది. అంతే కాకుండా పొద్దుతిరుగుడు నూనె జుట్టును బలపరుస్తుంది, జుట్టు రాలడాన్ని నిరోధిస్తుంది. పొద్దుతిరుగుడు నూనె తేలికగా జీర్ణమయ్యే నూనెలలో ఒకటి. ఇది కడుపులో అలసట లేకుండా నెమ్మదిగా జీర్ణమవుతుంది.


**పొద్దుతిరుగుడు నూనె వల్ల కలిగే దుష్ప్రభావాలు**

అధిక ఉష్ణోగ్రత వద్ద పొద్దుతిరుగుడు నూనెను వేడి చేయడం వల్ల ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు విడుదలవుతాయి. ఇవి గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ నూనెలో ఓమెగా-6 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఓమెగా-6 అధికంగా తీసుకోవడం శరీరంలో వాపులను పెంచే అవకాశం కల్పిస్తుంది. పొద్దుతిరుగుడు నూనె మితంగా ఉపయోగించాలి. ఎక్కువగా ఉపయోగించడం వల్ల కాలరీలు అధికమవుతాయి. ఇది బరువు పెరగడానికి దారి తీస్తుంది.

**పొద్దుతిరుగుడు నూనె ఎంపిక.**

రెండు రకాల పొద్దుతిరుగుడు నూనెలు ఉన్నాయి – హై ఒలేయిక్ మరియు హై లినోలిక్. హై ఒలేయిక్ నూనెలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. హై లినోలిక్ నూనెలో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. కూల్-ప్రెస్డ్, అన్‌రిఫైన్డ్ పొద్దుతిరుగుడు నూనెను ఎంచుకోవడం మంచిది. ఎందుకంటే ఇందులో పోషక విలువలు అధికంగా ఉంటాయి. పొద్దుతిరుగుడు నూనె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. కానీ, ఏదైనా ఆహారం మాదిరిగానే, పొద్దుతిరుగుడు నూనెను కూడా మితంగా తీసుకోవాలి. మీ ఆహారంలో పొద్దుతిరుగుడు నూనెను చేర్చే ముందు మీ వైద్యుని సలహా తీసుకోవడం మంచిది.

# ఫూల్ మఖానా తింటే ఈ సమస్యలన్నీ దూరం.. ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అవాక్కే..!



తామర గింజలు వేయించి తినడం వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయి. వీటిని మార్కెట్‌లో ఫూల్ మఖానా అని అమ్ముతారు. ఫూల్ మఖానా చూడడానికి తెల్లగా, గుండ్రంగా ఉంటాయి. ఫూల్ మఖానా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తామర గింజలు తినడం వల్ల శరీరానికి అనేక పోషకాలు అందుతాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు అందుతాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి అందే పోషకాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం. తామర గింజలు తినడం వల్ల శరీరానికి అనేక పోషకాలు అందుతాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. వీటిని మార్కెట్‌లో ఫూల్ మఖానా అని అమ్ముతారు. ఈ ఫూల్ మఖానాతో చిరుతిళ్లు, కూరలను తయారు చేస్తుంటారు. ఇందులో ప్రోటీన్,ఫైబర్ శాతం అధికంగా లభిస్తుంది. ఫూల్ మఖానాలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. అధిక బరువుతో ఉన్నవారు ఆకలి ఎక్కువగా ఉంటే ఈ మఖానా తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దాంతో పదే పదే తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గుతారు. ఫూల్ మఖానాలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. దీని తీసుకోవడం వల్ల సులభంగా బరువు సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. అంతేకాకుండా దీని వల్ల నరాల పనితీరు మెరుగుపడుతుందని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఫూల్ మఖానాలో మెగ్నీషియం ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఎముకలను, దంతాలను ధృడంగా ఉంచడంలో కూడా ఫూల్ మఖానా మనకు సహాయపడుతుంది. ప్రతిరోజు వీటిని తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు, వాపులు వంటివి తగ్గుతాయి. ఫూల్ మఖానాతో గుండె పనితీరును మెరుగుపరచడంలో ఫూల్ మఖానా ఎంతో మేలు చేస్తుంది. ఇందులోని మెగ్నిషియం, గల్లిక్ యాసిడ్స్ గుండెపోటు వంటి వ్యాధులను తగ్గిస్తుంది. రక్తహీనత సమస్యను దూరం చేయడంలో ఫూల్ మఖానా సహాయపడుతుంది. కీడ్నీల్లోని ఆక్సిడేటీవ్ స్ట్రెస్‌ను తగ్గిస్తాయి. రాళ్లు ఏర్పడకుండా ఫూల్ మఖానా కాపాడతాయి. ఈ విధంగా ఫూల్ మఖానా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# బాగా పండిన అరటి పండ్లు పడేస్తున్నారా..? మీరు ఆరోగ్యాన్ని కోల్పోతున్నట్లే..! తెలిస్తే ఆశ్చర్యపోతారు..



బాగా పండిన అరటి పండులో టన్నుల కొద్దీ పోషకాలు ఉంటాయని మీకు తెలుసా..? శరీరానికి సరైన జీవక్రియలను నిర్వహించడానికి ఎంతగానో సహాయపడుతుంది. సులభంగా జీర్ణం అవుతాయి. దీంతో జీర్ణ సమస్యలు తగ్గుతాయి. గ్యాస్, మలబద్ధకం, అసిడిటీని దూరం చేస్తుంది. విరేచనాలు తగ్గుతాయి. సాధారణంగా పండిన అరటి పండ్లతో పోలిస్తే బాగా పండిన అరటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. యాంటీఆక్సిడెంట్స్ అధికంగా ఉన్న కారణాన, కణ నష్టాన్ని నిరోధిస్తుంది. అంతర్గత డ్యామేజీలు, ఫ్రీ రాడికల్స్ వలన కలిగే కణాల నష్టాన్ని తగ్గించడానికి బాగా పండిన అరటి పండు ఉపయోగపడుతుంది. అరటి పండ్లు అల్సర్స్ సమస్యతో బాధపడు తున్న వారికి,అత్యంత లాభదాయకమైన పండుగా ఉంటుంది. అల్సర్ సమస్యతో ఉన్న వ్యక్తి నిస్సంకోచంగా ఈ పండిన అరటి పండును తీసుకొనవచ్చు. అలాగే,పండిన అరటి పండ్లలో పొటాషియ ం సమృద్ధిగా ఉంటుంది. మరియు సోడియం నిక్షేపాలు తక్కువగా ఉంటాయి. ఇది మీ కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడానికి మేలు చేస్తుంది. ఒక మోస్తరుగా పండిన అరటి పండ్ల కన్నా బాగా పండిన అరటి పండ్లలోనే పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బాగా పండిన అరటి పండ్లను తింటేనే శక్తి బాగా లభిస్తుంది. దీంతో అలసిపోకుండా పనిచేయవచ్చు. పండిన అరటి పండ్లలో ఐరన్ అధికంగా ఉన్న కారణాన అనీమియా సమస్యను నివారిస్తుంది. పండిన అరటి పండ్లను తినడం వల్ల మీ రక్త స్థాయిలను సహజ సిద్ధంగా పెంచడానికి సహాయపడుతుంది. బాగా పండిన అరటి పండ్లను తింటే శక్తి బాగా లభిస్తుంది. ఉత్సాహం వస్తుంది. నీరసం, నిస్సత్తువ తగ్గిపోతాయి. ఉత్సాహంగా పనిచేస్తారు.

# చింతచిగురును ఆహారంలో చేర్చుకుంటున్నారా?



చింతచిగురును భారతీయ ఆహారంలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఇది తెలుగు వారికి చాలా ప్రత్యేకమైనది. ఇది పులుపు రుచితో, ఆహారానికి ప్రత్యేకమైన రుచిని,ఘాటుదనాన్ని అందిస్తుంది. చింతచిగురును ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఈ ఆకులు పోషకాలు, యాంటీఆక్సి డెంట్లు, ఔషధ గుణాల ద్వారా శరీరానికి మేలు చేస్తాయి. వేసవి కాలంలో మనకు సులభంగా దొరికే ఈ చింతచిగురును ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం..

**చింతచిగురుతో ఆరోగ్య ప్రయోజనాలు**

**1. జీర్ణ వ్యవస్థకు మేలు**

చింతచిగురు ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీర్ణాశయం మెరుగ్గా పనిచేస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడు తుంది. పులుపు స్వభావం ఆకలిని పెంచుతుంది మరియు కడుపులో గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది.

**2. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది**

చింతచిగురులో నేచురల్ యాసిడ్స్ ఉండటంతో ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. పులుసు వంటి వంటకాలలో చింతచిగురు వినియోగం జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది.

**3. ఇమ్యూనిటీ పెంపు**

చింతచిగురులో విటమిన్ సి,యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలపరచడం ద్వారా శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. ఇది జలుబు, దగ్గు వంటి సమస్యలు తగ్గిస్తుంది.

**4. ఎముకల బలం పెంపు**

చింతచిగురులో కాల్షియం ఉండటం వలన ఇది ఎముకల బలాన్ని పెంపొందిస్తుంది. ఇది ప్రధానంగా పిల్లల మరియు వృద్ధుల ఎముకల ఆరోగ్యానికి మంచిది.

**5. రక్త శుద్ధి**

చింతచిగురులో ఉన్న యాంటీఆక్సిడెంట్లు రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడతాయి. ఇది టాక్సిన్లను తొలగించి చర్మం ఆరోగ్యవంతం గా కనిపించేలా చేస్తుంది.

**6. చర్మ సమస్యలు**

చింతచిగురును వాడటం మూలంగా చర్మ సమస్యలు, అలర్జీలు తగ్గుతాయి. దీని శీతల స్వభావం చర్మానికి తేమను అందించి, పొడిబారడం నివారిస్తుంది. చింతచిగురులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని మృదువుగా , ఆరోగ్యంగా ఉంచుతాయి.

**7. డిటాక్స్ ఫలితాలు**

చింతచిగురులో యాంటీఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉండటం వల్ల ఇది శరీరంలో నెమ్మదిగా ఉండే ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. ఇది ముఖ్యంగా కాలేయం ఆరోగ్యం కోసం ఉపయోగకరం.

**8. రక్తపోటు నియంత్రణ**

చింతచిగురులో ఉన్న పోషకాల ద్వారా రక్తపోటు స్థాయిలు సాధారణంగా ఉండేలా చేస్తుంది. ఇది ముఖ్యంగా హైబ్లడ్‌ప్రెషర్ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.

**9. మానసిక ఆరామం**

చింతచిగురు ఆహారంలో చేర్చుకోవడం ద్వారా శరీరానికి ప్రశాంతత కలుగుతుంది. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించి, శరీరాన్ని ఉత్తేజితంగా ఉంచుతుంది. చింతచిగురు కేశాలకు మంచిది. ఇది జుట్టు రాలడాన్ని నిరోధిస్తుంది. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. చింతచిగురును పప్పు, పులుసు, సూప్‌లలో ఉపయోగిస్తారు. ఈ ఆకుల సహజ రుచితో ఆహారం ప్రత్యేకమైన రుచిని పొందుతుంది. అయితే చింతచిగురును అధికంగా తీసుకోవడం ఆమ్లత్వాన్ని పెంచవచ్చు. కడుపు సమస్యలున్నవారు డాక్టర్ సూచనతో మాత్రమే వినియోగించాలి.

# రాసి పెట్టుకోండి.. ఈ నక్షత్రాలలో పుట్టినవారు జీవితాంతం కుబేరులే!

వేద జ్యోతిష్య శాస్త్రం ప్రకారం మాత్రమే కాదు పుట్టిన నక్షత్రం కూడా వివిధ జాతకుల జీవితాన్ని నిర్ణయిస్తుంది. కొన్ని నక్షత్రాలలో పుట్టిన వారు వారి పుట్టిన నక్షత్రాన్ని బట్టి కొందరు సానుకూల ఫలితాలను, కొందరు ప్రతికూల ఫలితాలను పొందుతారు. కొన్ని నక్షత్రాలలో జన్మించిన వారికి ఆర్థిక పరిస్థితి జీవితాంతం లోటు లేకుండా, తిరుగులేకుండా సాగిపోతుంది. వారంతా పుట్టుకతోనే అదృష్టవంతులుగా ఉంటారు.



**సంపన్నులుగా చేసే అదృష్ట నక్షత్రాలు**

ఎవరైనా సరే పుట్టిన సమయాన్ని బట్టి ఆ సమయంలో ఉన్న నక్షత్రాన్ని జన్మ నక్షత్రంగా భావిస్తాం. ఆ విధంగా చూస్తే వారి జన్మ నక్షత్రం ఆధారంగా కూడా వారి జీవితం ఉంటుంది. ముఖ్యంగా కొన్ని నక్షత్రాలలో పుట్టిన వారికి అదృష్టం మామూలుగా ఉండదు. వారు అన్ని విధాల ఆర్థిక ప్రయోజనాలను పొందటమే కాకుండా జీవితాంతం సంపన్నులు గానే ఉంటారు. మరి ఆ అదృష్ట నక్షత్రాలు ఏమిటో ప్రస్తుతం మనం తెలుసుకుందాం.

**అశ్విని నక్షత్రం**

అశ్విని నక్షత్రంలో పుట్టిన వారు ఏ రంగంలోనైనా ఒక వెలుగు వెలుగుతారు. వీరు చిన్నప్పటి నుంచే సంపన్నులుగా ఉంటారు. సాధారణంగా తెలివితేటలు, ధైర్య సాహసాలు కలిగిన వారుగా ఉంటారు. సొంత ఆలోచనలతో జీవితాంతం వీరు గొప్పగా జీవిస్తారు.

**భరణి నక్షత్రం**

భరణి నక్షత్రంలో పుట్టిన వారు జీవితాంతం ధనవంతులుగా ఉంటారు. వీరు స్థిరాస్తులను ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ఈ జన్మ నక్షత్రానికి అధిపతి శుక్రుడు కావడంతో వీరు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు. అందాన్ని ఆరాధించేవారుగాను, ఆనందాన్ని కోరుకునే వారిగాను, కళా పోషకులుగాను వీరు జీవిస్తారు.

**కృత్తికా నక్షత్రం**

కృత్తిక నక్షత్రంలో జన్మించిన వారు సాధారణంగా విద్యావంతులుగా ఉంటారు. వీరి జీవితకాలమంతా ధనవంతులుగానే జీవిస్తారు. వీరు ఆరోగ్యంగానూ, నిజాయితీగాను, ప్రకాశవంతంగానూ ఉంటారు. డబ్బుకు లోటు లేకుండా వీరి జీవితం సాగిపోతుంది.

**మఖా నక్షత్రం**

మఖా నక్షత్రంలో జన్మించిన వారికి నాయకత్వ లక్షణాలు మెరుగ్గా ఉంటాయి. మీరంతా నైతికతను కలిగి ఉంటారు. జీవితాంతం సంపద, అదృష్టాన్ని కలిగి ఉన్నవారుగా ఉంటారు. వీరి అదృష్టం కారణంగా వీరు జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారు.

**పూర్వ ఫాల్గుణి నక్షత్రం**

పూర్వఫాల్గుణి నక్షత్రంలో జన్మించిన వారు పుట్టుకతోనే అదృష్టవంతులు. వీరు పట్టిందల్లా బంగారం అవుతుంది. అందంగా ను సమర్థులుగాను ఉంటారు. చక్కగా మాట్లాడటం లోను, ఇతరులతో పని చేయించడంలోనూ, ఇతరులతో సన్నిహితంగా మెలగడంలోనూ నైపుణ్యాన్ని కనబరుస్తారు. స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన వారుగా ఉంటారు. కళల పట్ల ఆసక్తి ఉంటుంది. విలాసాలను ఇష్టపడతారు.

**ఉత్తర ఫాల్గుణి నక్షత్రం**

ఉత్తర ఫాల్గుణి నక్షత్రంలో పుట్టిన వారు ఏ రంగంలోనైనా విజయం సాధించగలిగిన వారిగా ఉంటారు. వీరు పుట్టుక నుండే సంపన్నులుగా జీవిస్తారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉండగలిగిన వ్యక్తులుగా ఉంటారు. ఎలాంటి ప్రతికూల పరిస్థితులైన సానుకూలంగా మార్చే నైపుణ్యం వీరిలో ఉంటుంది.

# తరచూ జుట్టుకు రంగు వేస్తున్నారా? ఎంత డెంజరో తెలుసా?



జుట్టుకు రంగు వేయడం చాలా మందికి ఫ్యాషన్,స్టైల్ స్టేట్‌మెంట్‌గా మారింది. తెల్లటి వెంట్రుకలను దాచడం, రూపాన్ని మార్చుకోవడం వంటి కారణాలతో చాలామంది జుట్టుకు రంగు వేస్తుంటారు.

అయితే, తరచుగా జుట్టుకు రంగు వేయడం వల్ల కొందరు అనుకోని ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. జుట్టు రంగులు మామూలుగా రసాయనాలతో తయారు చేయబడి ఉంటాయి, ఇవి జుట్టు సహజ ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ అందం కోసం మనం చెల్లించే మూల్యం ఏమిటి? జుట్టుకు రంగు వేయడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**జుట్టుకు రంగు వల్ల కలిగే దుష్ప్రభావాలు:**

హెయిర్ డైస్‌లో ఉండే రసాయనాలు జుట్టును పొడిగా చేస్తాయి. ఫలితంగా జుట్టు చిట్లిపోతాయి. కొంతమందికి హెయిర్ డైస్ వల్ల తల చుండ్రు సమస్య తీవ్రమవుతుంది. ఇది తలలో దురద, వాపు వంటి ఇతర సమస్యలకు కూడా దారితీస్తుంది. హెయిర్ డైస్‌లో ఉండే పారా-ఫెనిలీన్‌డైయామైన్ అనే రసాయనం కొంతమందికి అలర్జీని కలిగిస్తుంది. ఇది చర్మం ఎర్రబడటం, వాపు, దురద, కళ్ళు నీరు కారడం వంటి లక్షణాలకు దారితీస్తుంది. తీవ్రమైన సందర్భాల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కూడా కలగవచ్చు. రంగులలో ఉన్న హార్ష్ కెమికల్స్ జుట్టు ఫాలికల్స్‌ను బలహీన పరుస్తాయి. ఇది జుట్టు ఊడిపోవడానికి కారణం అవుతుంది. ప్రత్యేకంగా, సెన్సిటివ్ స్కాల్ప్ ఉన్నవారు మరింత ఇబ్బంది పడే అవకాశం ఉంది. సూర్యకాంతి, క్లోరిన్ వంటి వాతావరణ కారకాలు హెయిర్ డై కలిగిన జుట్టు రంగును మార్చవచ్చు. కొన్ని అధ్యయనాల ప్రకారం, తరచుగా హెయిర్ డైస్ వాడడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌ల ముప్పు పెరుగుతుందని తెలుస్తోంది. అయితే, ఈ విషయంలో మరింత పరిశోధన అవసరం. తలకు రంగు వేసేటప్పుడు చర్మంపై రసాయనాలు తగిలే అవకాశం ఉంటుంది. ఇది చర్మ క్యాన్సర్‌కు కారణం కావచ్చు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

హెయిర్ డై వాడే ముందు చిన్న భాగంలో ప్యాచ్ టెస్ట్ చేయడం చాలా ముఖ్యం. కొత్త బ్రాండ్‌లను వాడే ముందు వాటి గురించి సరిగ్గా తెలుసుకోవాలి. రసాయనాలు తక్కువగా ఉండే సహజ రంగులను ఎంచుకోవడం మంచిది. జుట్టుకు సంబంధించిన సమస్యలకు వృత్తిపరమైన సలహా తీసుకోవడం మంచిది. హెయిర్ డైస్‌లో ఉండే రసాయనాలు గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, పిల్లలకు హానికరం. కనుక వారు జుట్టుకు రంగు వేయడం వంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. హెయిర్ డైస్‌ను వాడే ముందు తలను బాగా కడగాలి. కళ్ళకు తగలకుండా జాగ్రత్త పడాలి. హెయిర్ డైస్‌ను వాడిన తర్వాత తలను బాగా శుభ్రం చేసుకోవాలి. జుట్టుకు రంగు వేయడం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి తెలుసుకున్న తర్వాత, మీరు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవచ్చు. అందం కోసం ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేయవద్దు. సహజమైన అందాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించండి.

## కిలో టమాటా రూ.2... గిట్టుబాటు ధర లేక 4 ఎకరాల పంటకు నిప్పంటించిన రైతు

నవాబ్‌పేట గ్రామంలో ఎక్కువ మంది రైతులు టమాటాను సాగు చేస్తుంటారు. ఈసారి దాదాపు 70 ఎకరాల్లో టమాటా పండించారు.కూలీలతో టమాటాను తెంపించి... మార్కెట్‌కు తీసుకు వెళితే అయ్యే రవాణా ఛార్జీలు కూడా రావడం లేదని రవి గౌడ్ ఆందోళన వ్యక్తం చేశాడు. టమాటాను నిల్వ చేసుకోవడానికి కూడా అవకాశం లేదని చెబుతున్నాడు. గిట్టుబాటు ధర లేక... నాలుగు ఎకరాల్లోని మూడు టన్నులకు పైగా పంటను పూర్తిగా తొలగించినట్లు చెప్పాడు.

## నా కోసం నేనో ఇల్లు కట్టుకోలేదనే విషయం దేశానికి తెలుసు: ప్రధాని మోదీ

మోదీ తన కోసం ఇల్లు కట్టుకోలేదన్న విషయం దేశం మొత్తానికి తెలుసని, కానీ గత పదేళ్లలో పేదల కోసం 4 కోట్ల ఇళ్లు నిర్మించి వారి కలలను సాకారం చేశామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించిన పలు నివాస సముదాయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాము నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని... కానీ తానేమీ అద్దాల మేడలో ఉండటం లేదన్నారు. ఢిల్లీ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ ప్రభుత్వం లిక్కర్, స్కూల్, పొల్యూషన్ స్కాంలకు పాల్పడిందని విమర్శించారు. బహిరంగంగానే అవినీతికి పాల్పడుతున్నారన్నారు. గత పదేళ్లుగా ఢిల్లీని ఓ విపత్తు చుట్టుముట్టిందని ఆమ్ ఆద్మీ పార్టీని ఉద్దేశించి అన్నారు. ఇప్పుడు ప్రజలు ఆ విపత్తుకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధమయ్యారని వ్యాఖ్యానించారు.అసలైన విపత్తు బీజేపీలోనే ఉందంటూ ప్రధాని మోదీకి మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీలో విపత్తు లేదని, బీజేపీలోనే ఉందన్నారు. అసలు బీజేపీకి ఢిల్లీలో సీఎం అభ్యర్థి లేరని, ఆ పార్టీకి ఎలాంటి విజన్ లేదని, ఢిల్లీ ఎన్నికలకు సంబంధించి ఆ పార్టీకి అసలు అజెండానే లేదని కేజ్రీవాల్ మూడు పాయింట్లతో విమర్శలు గుప్పించారు. వేల కోట్లతో భవనం నిర్మించుకున్న వ్యక్తి... వేల కోట్లతో విమానంలో తిరిగే వ్యక్తి... లక్షల విలువ చేసే సూట్ ధరించే వ్యక్తి నుంచి అద్దాల మేడ ప్రస్తావన రావడం విడ్డూరంగా ఉందన్నారు.

## ఎన్నికల సమయంలోనే బీఆర్ఎస్ నేతలు బీసీల గురించి మాట్లాడుతున్నారు: పొన్నం ప్రభాకర్

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో బీసీలకు ఏం చేసిందో చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్ ముఖ్య రాజకీయ పదవుల్లో ఏదో ఒక పదవిని బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పార్టీలో ఒక కులానికి చెందిన వ్యక్తి సీఎం అయితే... మరో కులానికి చెందిన వ్యక్తి పీసీసీ చీఫ్ అయ్యారని తెలిపారు. పార్టీలో తానూ హక్కుదారుడినే అని ఈటల రాజేందర్ అన్నందుకే ఆయనను బయటకు పంపించారన్నారు.బీసీ హాస్టళ్లను బీఆర్ఎస్ పదేళ్లు పట్టించుకోలేదని విమర్శించారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించిందే బీఆర్ఎస్ అన్నారు. తమ ప్రభుత్వం చేయిస్తున్న కుటుంబ సర్వే వివరాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి నిపుణులతో చర్చించి అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ పార్టీలో వ్యక్తుల ఇష్టాయిష్టాలతో సంబంధం ఉండదన్నారు. పార్టీ అజెండానే ముఖ్యమన్నారు.

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

ఈ క్రమంలోనే కేసు ఫిర్యాదుదారు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ నుంచి పలు విడతలుగా సమాచారం సేకరించింది.ఇటీవల దాన కిశోర్‌ను ఏడు గంటల పాటు విచారించిన ఏసీబీ పలు వివరాలను తీసుకుంది. దాన కిశోర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకువెళుతోంది. ఈ క్రమంలోనే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. ప్రాథమిక దర్యాప్తు క్రమంలో ఎంఏయూడీ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా, ఒప్పందంలో చోటు చేసుకున్న పలు కీలక ఉల్లంఘనలు ఉన్నట్టు ఏసీబీ భావిస్తోంది. వీటి ఆధారంగా నిందితులను విచారించే అవకాశం కనిపిస్తోంది.

## రెండు రాష్ట్రాల ప్రజలకు మేలు జరగాలని కోరుకున్నానన్న అరుణ

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై తెలంగాణ బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశంసలు కురిపించారు.సీఎంగా చంద్రబాబు ఏపీని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు.విజయవాడ ప్రాంత బీజేపీ ఎమ్మెల్యే (విజయవాడ పశ్చిమ) సుజనా చౌదరి మంచి అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నారని చెప్పారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారిని డీకే అరుణ ఈరోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు అయిన తర్వాత అమ్మవారి దర్శనానికి రావాలనుకున్నామని...అయితే, ఆ సమయంలో వరదలు రావడంతో ఇక్కడకు రావడం ఆలస్యమయిందని డీకే అరుణ చెప్పారు. అమ్మవారు విజయానికి ప్రతీక అని... తనకు కూడా మంచి విజయాన్ని అందించారని అన్నారు. కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనానికి వచ్చామని తెలిపారు. తెలుగు వారు రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ... అందరికీ మంచి జరగాలని కోరుకున్నానని చెప్పారు. గతం కంటే అమ్మవారి ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు.

## టీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

దాదాపు నలభై యేండ్లుగా ప్రతి ఏటా జనవరి మొదటి వారంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) సంఘ ఆనవాయితీగా డైరీని ఆవిష్కరిస్తున్న విషయం తెలిసిందే.ఇందులో భాగంగా 2025 మీడియా డైరీని గురువారం నాడు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలోని తన ఛాంబర్ లో సమాచార శాఖ కమిషనర్ ఎస్. హరీష్ తో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఐజేయు జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్లూరి రాములు, కార్యదర్శి కె. శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్, గౌస్ మోహియుద్దీన్, అనీల్, హెచ్.యూ.జే అధ్యక్ష, కార్యదర్శులు శిగా శంకర్ గౌడ్, హమీద్ షౌకత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డికి, సమాచార శాఖ కమిషనర్ హరీష్ కు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. విరాహత్ అలీ, కె. రాంనారాయణ లు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## కొత్త వైరస్ కథనాలపై స్పందించిన చైనా

హెచ్ఎంపీవీ వైరస్ విషయమై వస్తోన్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని చైనా తెలిపింది. చైనాలో కొత్త వైరస్ హెచ్ఎంపీవీ కారణంగా ఆసుపత్రుల్లో రద్దీ పెరిగిందని కథనాలు వచ్చాయి.దీంతో చైనా విదేశాంగ శాఖ ఈ కథనాలపై స్పందించింది. కొత్త వైరస్ కారణంగా ఆసుపత్రుల్లో రద్దీ పెరిగిందన్న నివేదికలను కొట్టిపారేసింది. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల తీవ్రత సహజమేనని, అయినప్పటికీ గత ఏడాదితో పోలిస్తే తీవ్రత తక్కువగా ఉందని తెలిపింది.విదేశీయులు తమ దేశంలో పర్యటించేందుకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సురక్షితమేనని హామీ ఇచ్చింది. చైనా పౌరులతో పాటు తమ దేశంలోని విదేశీయుల ఆరోగ్యంపై తమ ప్రభుత్వం శ్రద్ధ చూపుతుందని వెల్లడించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ వెల్లడించారు. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల నిర్మూలన, నియంత్రణకు సంబంధించి తమ దేశానికి చెందిన నేషనల్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు.హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు తెలిపారు.ఈ వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుందని చెబుతున్నారు.దగ్గు,తుమ్ములతో బాధపడే వారి తుంపర్లు,వైరస్ బారిన పడిన వ్యక్తులతో సన్నిహితంగా ఉండటం, కరచాలనం చేయడం, తాకడం వంటి చర్యలతో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని డాక్టర్లు చెప్పారు.

## రేవంత్ రెడ్డి ప్రజాదర్బార్‌కు ఒకేరోజు హాజరయ్యారు: హరీశ్ రావు



ప్రజాదర్బార్‌లో మంత్రులు అందుబాటులో ఉంటారని సీఎం చెప్పారని,కానీ ఆ మాటను కూడా నిలబెట్టుకోలేదన్నారు. మంత్రులకు గాంధీభవన్‌కు వెళ్లేందుకు ఉన్న తీరిక, ప్రజావాణికి రావడానికి మాత్రం ఉండటం లేదన్నారు. దీంతో ప్రజావాణి పట్ల మంత్రుల చిత్తశుద్ధి ఏపాటిదో కూడా తేలిపోయిందన్నారు. సీఎం రాకుండా... మంత్రులూ రాకుండా... చివరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో తూతూ మంత్రంగా ప్రజావాణి నిర్వహిస్తున్నారని ఆరోపించారు.ప్రజాదర్బార్‌ను ప్రతి రోజు నిర్వహిస్తామని మేనిఫెస్టోలో పేర్కొని, ఇప్పుడు వారానికి 2 రోజులు మాత్రమే నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఆ రెండు రోజులు కూడా ప్రజావాణికి రావడం, దరఖాస్తులు సమర్పించడం ఉత్త వృథా ప్రయాసే అవుతోందని జనం వాపోతున్నారన్నారు. 2024 డిసెంబర్ 9 నాటికి ప్రజావాణికి 82,955 పిటిషన్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారని, అయితే, అందులో కేవలం 43,272 పిటిషన్లు మాత్రమే గ్రీవెన్స్ కిందకు వస్తాయని, మిగతావి గ్రీవెన్స్ పరిధిలోకి రావని చెబుతున్నారన్నారు. గ్రీవెన్స్‌కు సదరు అధికారులు ఇస్తోన్న నిర్వచనం ఏమిటంటే...ఫిర్యాదు,అన్యాయం,హక్కులకు భంగం, ప్రభుత్వ పథకాలు అందకపోవడం, అధికారులు వారి విధులు నిర్వహించకపోవడం, ప్రజలకు సిటిజన్ చార్టర్ ప్రకారం అందాల్సిన సదుపాయాలు అందకపోవడం... వీటినే గ్రీవెన్స్ కింద పరిగణిస్తామని చెబుతున్నారని తెలిపారు.ఈ నిర్వచనం ప్రకారం భూతగాదాలు గానీ, భూనిర్వాసితుల సమస్యలు గానీ, నిరుద్యోగుల సమస్యలు గానీ, వివిధ వర్గాల పేదరిక సంబంధ సమస్యలు గానీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు మొదలైన విషయాలు గ్రీవెన్స్ కిందకు రావంటూ సగం దరఖాస్తులను అధికారులు తిరస్కరించారని ఆరోపించారు. గ్రీవెన్స్ పరిధిలోకి రావని 50 శాతం ప్రజావాణి పిటిషన్లను అధికారులు తిరస్కరించినట్లు వెల్లడైందన్నారు.అయితే, 27,215 గ్రీవెన్స్‌లు పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ అది నిజం కాదన్నారు. చాలా సమస్యలను పరిష్కరించకుండానే ఫైళ్లను క్లోజ్ చేసినట్లు క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా యని విమర్శించారు.సమస్య పరిష్కారం కాలేదని చెబుతున్నా వినిపించుకోకుండా, ఫైల్ క్లోజ్ చేశారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజావాణిలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి హైదరాబాద్ వరకు వస్తే, ఆశలు అడియాసలవుతున్నాయని, పడ్డ శ్రమ వృథా అవుతోందని ప్రజలు వాపోతున్నారన్నారు.మొత్తం మీద సోకాల్డ్ ప్రజాపాలన ప్రజా పీడనగా మారిందని, ప్రజావాణి ఉత్త ప్రహసనం మాత్రమేనని తేలిపోయిందన్నారు. మేనిఫెస్టోలోని మొదటి హామీ నీటిమీది రాతగా మిగిలిపోయిందన్నారు. కాగా, తాను ఇచ్చిన సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా సేకరించినట్లు హరీశ్ రావు చివరలో పేర్కొన్నారు.

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. ఇక తెలుగులోనూ




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రభుత్వ ఉత్తర్వులను తెలుగులోనూ జారీ చేయాలని నిర్ణయించింది. ఇంగ్లీష్, తెలుగు.. రెండు భాషల్లోనూ ఉత్తర్వులు ఇవ్వాలని ఈ మేరకు వివిధ శాఖలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.మొదట ఇంగ్లీష్‌లో ఉత్తర్వులు ఇచ్చి అప్‌లోడ్ చేయాలని.. ఆ తర్వాత రెండు రోజుల్లోగా తెలుగులోనూ అవే ఉత్తర్వులు జారీకి చర్యలు తీసుకోవాలని వివిధ శాఖలకు సాధారణ పరిపాలన శాఖ సూచించింది. ఉత్తర్వుల అనువాదానికి డైరెక్టర్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ సేవలు వినియోగించుకోవాలని జీఏడీ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.పాలనా వ్యవహారాలు, ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే జారీ చేసేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల విజయవాడలో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభ తీర్మానించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల తెలుగు కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇది ఇలావుండగా, హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహా సభలను ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలెడ్జ్ ఎకనాలో తెలుగువారు మరింత ఉన్నత స్థితికి ఎదగాలని అన్నారు. ఏఐ, డీప్ టెక్నాలజీని తెలుగువాళ్లు అందిపుచ్చు కోవాలన్నారు. ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలిసారి ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు ప్రారంభయ్యాయని గుర్తు చేశారు. అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకు.. శ్రీకాకుళం నుంచి పాలమూరు వరకు ఎక్కడ ఉన్నా తెలుగు వారంతా ఒక్కటేనని అన్నారు. అదే తెలుగు జాతి అని వ్యాఖ్యానించారు. తెలంగాణ, ఏపీ, ఆస్ట్రేలియా, అమెరికా.. ఇలా ప్రపంచ నలుమూలల నుంచి ఇక్కడికి తెలుగువారు వచ్చారన్నారు. కాగా, ప్రపంచ తెలుగు సమాఖ్యకు 1993లో శ్రీకారం చుట్టగా.. తొలి మహా సభలు 1996లో హైదరాబాద్‌లో జరిగాయి.

## రెండు జాతీయ పార్టీలు బీసీలకు తీరని అన్యాయం చేశాయన్న కవిత



కేసీఆర్, ఎన్టీఆర్ వంటి ప్రాంతీయ పార్టీల నేతలే బీసీలకు న్యాయం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ గాంధీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు.ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన బీసీ మహాసభలో ఆమె మాట్లాడుతూ... బీసీలకు రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు బీసీలకు తీరని అన్యాయం చేశాయన్నారు. తాను చెప్పింది తప్పయితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు.ఈ దేశ మొదటి ప్రధాని నెహ్రూ కాకా కాలేల్కర్ కమిషన్ నివేదికను తిరస్కరించారని, ఇది బీసీలకు కాంగ్రెస్ చేసిన ద్రోహం కాదా?అని ప్రశ్నించారు. మండల్ కమిషన్‌ను మొరార్జీ దేశాయ్ నియమించారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వాలు కాదని తెలిపారు. మండల్ కమిషన్ నివేదికను కాంగ్రెస్ తొక్కి పెట్టిందన్నారు. 1980లో మండల్ కమిషన్ నివేదిక ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.మళ్లీ కాంగ్రెసేతర ప్రధాని వీపీ సింగ్ వచ్చినప్పుడే కమిషన్ నివేదికను అమలు చేసిందన్నారు. బీసీల కోసం పని చేస్తున్న వీపీ సింగ్ ప్రభుత్వాన్ని బీజేపీ పార్టీ కూలగొట్టిందన్నారు.బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే దేశం విచ్ఛిన్నమవుతుందని రాజీవ్ గాంధీ వ్యాఖ్యానించారని ధ్వజమెత్తారు. 2011 కులగణన చేసిన నివేదికను అప్పటి యూపీఏ ప్రభుత్వం బహిర్గతం చేయలేదని విమర్శించారు. ఆ తర్వాత వచ్చిన బీజేపీ ప్రభుత్వం కూడా నివేదిక బయటపెట్టలేదన్నారు.కులగణన చేయబోమని బీజేపీ స్పష్టం చేసిందన్నారు. రెండు జాతీయ పార్టీలు బీసీలకు తీరని అన్యాయం చేశాయన్నారు.కేవలం ప్రాంతీయ పార్టీలు మాత్రమే బీసీలకు న్యాయం చేశాయన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల లాభం ఏమిటో చెప్పాలన్నారు. సావిత్రీబాయి పూలే ఆడబిడ్డ కాదు... పులిబిడ్డ... మహిళా విద్యాకు ఎంతగానో కృషి చేశారన్నారు.


## రాష్ట్రం ఇక.. గ్రీన్ ఎనర్జీ హబ్




**శాసనసభ / హైదరాబాద్ :** రాష్ట్రం గ్రీన్ పవర్ రంగంలో అద్భుత విజయాలను సాధిం చి, దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోందని డి ప్యూటీ సిఎం మల్లు భట్టి అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాంకేతికత, ఫార్మాస్యూటిక ల్స్, ఉత్ప త్తి, వ్యవసాయా రంగాల అభివృద్ధికి కేంద్రం గా ఉద్భవించిందన్నారు. శుక్రవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మీడియాతో మాట్లాడారు. స్వచ్ఛమైన శక్తి వనరుల వినియోగంలో ముందంజ వేస్తూ, తెలంగాణ 11,399 గ్రీన్ పవర్ సామర్థ్యాన్ని సొంతం చే సుకుని, 2030 నాటికి 20,000 మెగావాట్ల ల క్ష్యాన్ని చేరుకునేదిశగాముందుకు సాగుతోందన్నా రు. విస్తరిస్తున్న పట్టణ జనాభా అవసరాలను తీర్చే ఆకుపచ్చ, స్థిరమైన పట్టణ పర్యావరణ వ్యవస్థ రూపకల్పనకు ఫ్యూచర్ సిటీకి శ్రీ కారం చుట్టామన్నారు. హైదరాబాద్ సమీపంలో అత్యాధునిక కృత్రిమ మేధస్సు, స్మార్ట్ టె క్నాలజీలతో ఏ ఐ సిటీ ద్వారా ఆధునిక నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. తెలంగాణను గ్లోబ ల్ ఫార్మాస్యూటికల్ హబ్‌గా తీర్చిదిద్దుతూ, లైఫ్ సైన్సెస్ రంగంలో అగ్రగామిగా మార్చేలా ఫార్మాసిటీ ఏర్పాటవుతోందని చెప్పారు. మెరుగైన కనెక్టివిటీ కోసం నాల్గవ నగరం రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ, , విమానాశ్రయం, పారిశ్రామిక కారిడార్‌తో రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ పవర్‌హౌస్‌గా మారుస్తున్నాయని చెప్పారు.

**పునరుత్పత్తి శక్తి సామర్థ్యాలు :**
ప్రస్తుత పునరుత్పత్తి శక్తి సామర్థ్యం 11,399 మెగావాట్లు, 7,889 మెగావాట్ల సౌరశక్తి,,2,518 మెగావాట్ల జలశక్తి, 771 మెగావాట్ల పంపిణీ పునరుత్పత్తి శక్తి, 221 మెగావాట్ల ఇతర పునరుత్పత్తి శక్తి (128 మెగావాట్లు పవన శక్తి), శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల్లో పంప్డ్ స్టోరేజ్ వున్నాయని, ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ వంటి ఆధునిక పరిష్కారాలు పరిశీలనలో ఉన్నాయన్నారు. 54,717 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం కలిగి, దేశంలో టాప్–8 రాష్ట్రాలలో ఒకటిగా నిలుస్తుందని, విద్యుత్ వాహన అభివృద్ధి, 872 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.
2024లో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,623 మెగా వాట్ల నుండి, 2030 నాటికి 24,215 మెగావాట్లు, 2035 నాటికి 31,809 మెగావాట్ల వరకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. 2030 నాటికి 20వేల మెగావాట్ల లక్ష్యంగా పని చేస్తున్నామని, ఇందుకోసం స్వచ్ఛమైన, నమ్మదగిన, సరసమైన, స్థిరమైన శక్తి వనరులు ముఖ్యమైనవని చెప్పారు. 300 సూర్యకాంతి రోజులతో రాష్ట్రం ఫోటోవోల్టిక్ సోలార్ ప్రాజెక్టులకు అనుకూలమైన ప్రాంతంగా నిలుస్తోందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ, పంప్డ్ స్టోరేజ్ వంటి ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తోందని వివరించారు. విద్యుత్ వాహన ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య ప్రస్తుతం 872కి చేరుకుందని, పారిశ్రామికవేత్తలకు పన్ను మినహాయింపులు, చెల్లింపుల సబ్సిడీలు వంటి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని తెలిపారు. అంతేకాక, వ్యర్థాలను శక్తిగా మార్చడం వంటి ప్రాజెక్టులను కూడా ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.
ప్రజలకు అందుబాటులో విద్యుత్ : తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం ప్రజల జీవితాలను మెరుగుపరచడంతో పాటు శక్తి వినియోగంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం. ఈ క్రమంలో రాష్ట్రం మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ పునరుత్పత్తి శక్తి రంగంలో ఇతర రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని, ఈ రంగంలో రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. ప్రస్తుత పునరుత్పత్తి శక్తి ప్రాజెక్టుల ద్వారా వేలాది కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్రం సుస్పష్టమైన విధానాలను అమలు చేస్తోందన్నారు. 2030 నాటికి 20వేల మెగావాట్ల సామర్థ్యాన్ని చేరుకోవడం మాత్రమే కాకుండా, తెలంగాణ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారాలని ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని తెలిపారు. తెలంగాణ పునరుత్పత్తి శక్తి రంగంలో సాధిస్తున్న ఈ అద్భుత విజయాలు రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తూ శక్తి వినియోగంలో స్వచ్ఛమైన మార్గాలను అనుసరించి దేశానికే ఒక దిశానిర్దేశం అందిస్తున్నాయని వివరించారు.

## రాష్ట్రంలో బ్లాక్ చెయిన్ సిటీ




**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు రా ష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వె ల్లడించారు. ఎక్కడ ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చే యాలనే అంశంపై ఇప్పటికే సంబంధిత పరిశ్రమలు, నిపుణులతో సంప్రదింపులు ప్రారంభించామన్నారు.శుక్రవారం మాదాపూర్ లో డ్రోన్ టెక్నాలజీ,రోబోటిక్స్ రంగంలో సుమారు1800 మందికి ఉపాధి కల్పిస్తున్న 'సెంటిలియన్ నెట్ వర్క్ అండ్ హెచ్ సీ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటె డ్' నూతన క్యాంపస్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కొత్త సాంకేతికల ఆవిష్కరణ లో తెలంగాణను నంబర్ వన్ గా నిలిచేలా ప్ర ణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఆయా రంగాల్లో తెలంగాణ యువతకు స్కిల్స్ యూనివర్సిటీ, పరిశ్రమల సహకారంతో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో నిర్మించ తలపెట్టిన ఏఐ యూనివర్సిటీకి త్వర లో శంకుస్థాపన చేయబోతున్నామని, ప్రత్యేకం గా క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎ క్స్ లెన్స్‌ను ప్రారంభించబోతున్నామని వివరించారు. దేశంలో ఫ్రాంటియర్ టెక్నాలజీ హబ్ ను ఏర్పాటు చేసే యోచనలో కేంద్రం ఉందని, ఆ హబ్ ను హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలంటూ ఇప్పటికే కేంద్రాన్ని కోరామన్నారు. ఇ క్కడి అనుకూలతలను ప్రత్యేకంగా వివరించామ ని, ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. పౌర సేవలను చివరి వ్యక్తి వరకు సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఏఐ, బ్లాక్ చెయిన్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ ను విరివిగా వినియోగించుకోబోతున్నామని తెలిపారు. ఇటీవలి కాలంలో కీలకంగా మారిన డ్రోన్ టెక్నాలజీపై తెలంగాణ యువతకు ప్రత్యేకంగా శిక్షణనిచ్చి వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కసరత్తు చేస్తున్నామని వివరించారు.

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

శనివారం 04 జనవరి - 2025 | 5పేజీ

# మహిళల విద్య కోసం కృషి

- తొలి మహిళా ఉపాధ్యాయురాలు
- రచయిత, భారతీయ సంఘసంస్కర్త
- యుటిఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రి బాయ్ పూలే ఘనంగా జయంతి వేడుకలు

**యాచారం శాసనసభ న్యూస్ ( జనవరి 03):.** తెలంగాణ యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు విరాటి అంజయ్య, ధనరాజ్ మాట్లాడుతూ.. మండల పరిధిలో మాల్ ప్రభుత్వ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానించారు. ఆమె తొలి




మహిళ ఉపాధ్యాయులు, భారతీయ సంఘ సంస్కర్త, రచయిత, నిమ్న జాతి వర్గాల అభ్యున్నతికి ఆమె ఎంతో కృషి చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరు చదువుకోవాలని అన్నారు. ఆమె మహిళలకు చేసిన సేవలను, గుర్తు చేసుకున్నారు. సావిత్రిబాయి లాగా భారతదేశంలో ప్రతి ఒక్క మహిళ విద్యపై నిరంతరం కృషి చేయాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విమల, కే రమేష్, శ్రీధర్, యాదయ్య, జగదీష్, శ్రీనివాస్ చారి, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించిన మర్రి నిరంజన్ రెడ్డి



**ఆదిభట్ల, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 3 :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో 29 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులు 5వ వార్డు కొంగర కలాన్ లో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించిన ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి. ఈ కార్యక్రమంలా కో ఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్ గౌడ్, కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, నల్లవోలు లావణ్య పాండురంగారెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్లు జమ్మ శ్రీశైలం, పల్లె శ్రీకాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ భూపతి గళ్ళ రాజు, నాయకులు అమరేందర్ గౌడ్,గజ్జల బాబు,నరసింహ్మా, వెంకటయ్య, అధికారులు ఏఈ శ్రావణ్ కుమార్, మేనేజర్ రమేష్, కాలనీవాసులు మరియు మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రి బాయ్ స్ఫూర్తితో.. మహిళలు చదువులో రాణించాలి

- అమ్మ లేనిది ప్రాణం లేదు
- గురువు లేనిదే జీవితం లేదు
- కన్ను లేకపోతే చూపు లేదు.. విద్య లేకపోతే జీవితమే లేదు
- చింతపట్ల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సావిత్రిబాయి జయంతి వేడుకలు

**యాచారం శాసనసభ న్యూస్ (జనవరి 03):.** సావిత్రిబాయి స్ఫూర్తితో మహిళలు విద్యలో రాణించాలని చైతన్య యువజన నాయకులు మచ్చా అరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో చింతపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ... ఆమె జన్మదిన వేడుకల సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్ 15 మందికి పంపిణీ చేశారు. విద్య ద్వారానే స్త్రీ విముక్తి పొందుతుందని అన్నారు, ఆమె జ్యోతిరావు పూలే భర్తతో 1848 సంవత్సరం జనవరి 1న పూణేలో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించారు. వ్యవస్థను విద్యతో మార్చాలన్నదే తన ప్రాణాలని లెక్కచేయకుండా మహిళలకు విద్య కోసం చేయని త్యాగం లేదని చెప్పారు. ఆమె త్యాగాలని గుర్తు చేసుకుని రాష్ట్ర



ప్రభుత్వం ఉపాధ్యాయుల దినోత్సవం గా గుర్తించి అధికారికంగా చేయడం మహిళల పట్ల ఎంతో చిత్తశుద్ధి ఉన్నదనేది తెలుస్తుందన్నారు. గురువు లేనిదే జీవితం లేదని, ఆమెను కొనియాడారు. ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో నరేష్, మస్కు శివ, మస్కు రమేష్, కార్తీక్, మస్కుబన్నీ, తొట్ట వంశీ, కుంటి మల్లేష్ వర్మ, కందుకూరు శివ, కొత్తపల్లి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నిర్వహించిన సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలు



**చండూర్ జనవరి 3 (శాసనసభ న్యూస్) :** చండూర్ మండలం పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో సావిత్రిబాయి పూలే గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చండూరు మండల ఎంపీడీవో పి రామ్ రెడ్డి, విశిష్ట అతిథులుగా చండూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన శ్యామ్, ప్రధాన వ్యక్తిగా బాల శ్రీనివాస్ పటేల్ గోల్కొండ డిగ్రీ లెక్చరర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళ ఉపాధ్యాయులు సల్వాది సుమలత, బోయపల్లి చైతన్య, జక్కుల మంజుల, పంచాయితీ కార్యదర్శి నర్మద లను సన్మానించడం జరిగింది.సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని రెండు రోజుల ముందు ఉంచే సావిత్రిబాయి పూలే జీవితం పై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ వ్యాసరచన పోటీలను రెండు విభాగాలుగా విభజించి కాలేజీ లెవెల్ ఒక భాగము, స్కూల్ లెవెల్ ఒక భాగంగా విభజించి పోటీలు నిర్వహించడం జరిగింది కాలేజీ లెవెల్ వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థికి కాశిమల్ల శివకుమార్ కు మొదటి బహుమతిగా బొడ్డు కాశయ్య జ్ఞాపకారంగా తన కుమారుడు బొడ్డు యాదయ్య చేత 2016 /- రూపాయలు అందించడం జరిగింది. రెండో బహుమతిగా తీగల కేశవులు గెలుపొందగా కురుపాటి మనోహరమ్మ జ్ఞాపకార్థంగా తన కుమారుడు కురుపాటి సుదర్శన్ 1116 /- రూపాయలు అందించడం జరిగింది.స్కూల్ లెవెల్ లో పాల్గొన్న విద్యార్థులు మొదటి బహుమతిగా మహేశ్వరం అజయ్ కు 1116 /- రూపాయలు రెండవ బహుమతి కాశీమళ్ళ మణి వర్మ కు 516/- రూపాయలు కురుపాటి మనోహరమ్మ జ్ఞాపకార్థంగా కురుపాటి సుదర్శన్ అందించడం జరిగింది.సావిత్రిబాయి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత యువతి చదివి ఉద్యోగాలు సంపాదించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని వచ్చిన అతిథులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామలింగారెడ్డి, కురుపాటి యాదయ్య, శ్రీనివాస్ రెడ్డి, బోయపల్లి రాజు, సిఆర్పిఎఫ్ జవాన్ కురుపాటి యాదయ్య,తుమ్మలపల్లి ప్రధాన ఉపాధ్యాయులు రామలింగయ్య,రోజా, స్వాతి, పరమేష్, చందన, హేమంతు, చంటి, సత్యనారాయణ చారి, శివకోటి, కందికట్టె నవీను, శివకుమార్, కాశిమళ్ళ శ్రీనివాస్, కురుపాటి శేఖర్, గౌతం, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మంకాల శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 3 :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం నాడు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయానికి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ జె.రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఓబిసి మండల చైర్మన్ బస్సుల రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్నం బీరప్ప ఆర్కే బలరాం శ్రీశైలం, గోపాల్, జంగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాచారం మండలంలో కొత్తగా రెండు సొసైటీలు ఏర్పాటు

- పిఎసిఎస్ పాలకవర్గ అభిప్రాయ సేకరణ
- అభివృద్ధి కోసమే సొసైటీలు పెంచుట
- డి సిసిబి చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య



**యాచారం శాసనసభ న్యూస్ ( జనవరి 03):.** యాచారం మండలంలో కొత్తగా మాల్, మేడిపల్లి సొసైటీలు ఏర్పాటు కోసం హైదరాబాదులో హెచ్ డి సి సి బి నాంపల్లిలో పిఎసిఎస్ రిఆర్గనేషన్ భాగంగా.. రంగారెడ్డి జిల్లా డిసి సిబి చైర్మన్, టీఈఎస్సిఎబి వైస్ చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య, డి సి ఓ సుధాకర్, డి సి సి బి, సీఈవో భాస్కర సుబ్రహ్మణ్యం తో యాచారం పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, పాలకవర్గం సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో పాలకవర్గం అభిప్రాయాలను తీసుకున్నారు. సంఘం అభివృద్ధి కోసం, రైతుల అభ్యున్నతే లక్ష్యమని అన్నారు. అందుకోసం యాచారంలో రెండు సొసైటీలను ఏర్పాటు కోసం రైతుల అభిప్రాయంతో పాటు ప్రజల అభిప్రాయాన్ని సేకరించాలని సమావేశంలో నిర్ణయించారు. పాలకవర్గం మాల్, మేడిపల్లి చెప్పిన అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపుతామని పై అధికారులు తెలిపారు. యాచారం, మాల్ సెంటర్లుగా సొసైటీలు గా పెంచుకుంటే రైతులకు న్యాయం జరుగుతుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.యాచారం సొసైటీకి యాచారం, నంది



వనపర్తి, సింగారం, తాడిపర్తి, కురుమిద్ద, నాన్నకు నగర్, మేడిపల్లి, మల్కిజు గూడా, చింతుల్ల, గునుగల్, గడ్డ మల్లయ్య గూడెం, చౌదర్పల్లి, ధర్మన్నగూడ ...మాల్ సెంటర్ నల్లవెల్లి, కొత్తపల్లి, తక్కల్లపల్లి, తక్కలపల్లి తండా, చింతపట్ల, మంతన్ గౌరెల్లి, కిషన్ పల్లి, మీసాల తండా, మొండి గౌరెల్లి, తమ్మలోని గూడ, ఈ గ్రామాలు రెండు భాగాలుగా ఏర్పాటు చేస్తే రైతుల అభివృద్ధి కోసం కృషి జరుగుతుందనేది ప్రజల అభిప్రాయంగా చెబుతున్నారు. మండలంలో మూడు సొసైటీలు ఏర్పాటు చేస్తే సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉంటుందని ప్రజల అభిప్రాయం. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కె యాదయ్య, డైరెక్టర్లు, కొండ మధుకర్ రెడ్డి, పాచ్చ భాష, కె నరేందర్ నాయక్, గౌరిగే ఐలయ్య, సత్యనారాయణ, అంబోజ్ లక్ష్మయ్య, మద్దెల శశికళ, మక్కపల్లి స్వరూప, కొండాపురం కలమ్మ, సీఈఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అరోరా లా కాలేజీ రెండో సంవత్సరం విద్యార్థి నాగిళ్ళ శంకర్ ప్రశంసా పత్రం గర్వించదగ్గ విషయం - ప్రిన్సిపల్ నక్క యాదగిరి.




**చండూర్ జనవరి 3 (శాసనసభ న్యూస్):** న్యాయ"దేవత"కండ్ల గంతలు కట్టి న్యాయం కోరుతున్నా అన్యాయపు సమాజాన్ని ఏమనాలి. సామాజిక అవగాహన పై స్పందిస్తూ సామాజిక కార్యకర్తగా అనేక అంశాలపై ఐదారి కలం ద్వారా రచనలు చేస్తూ అందులో భాగంగా న్యాయ"దేవత"కండ్ల గంతలు న్యాయం కోరుతున్నా అన్యాయపు సమాజాన్ని ఏమనాలి.అనే అంశంపై వ్యాసం రాయడం ఎవరు కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ 2024లో ఈ యొక్క అంశంపై న్యాయ దేవతకు కండ్లకు గంతలు తీయాలని నిర్వహించిన సందర్భంగా నేడు అరోరా లా కాలేజీలో రోజు లా మొదటి సంవత్సరం విద్యార్థులను స్వాగతం పలుకుతూ నా రెండవ సంవత్సరం విద్యార్థులు పెట్టిన ప్రోగ్రాంలో సావిత్రి బాయి 194 వ జయంతి సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ నక్క యాదగిరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూలమాలలు వేసి కార్యక్రమా నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో గొప్ప అంశాన్ని జోడిస్తూ నాగిళ్ళ శంకర్ రాసినటువంటి ఈ ఆర్టికల్ కు రాష్ట్రంలోనూ దేశంలోనూ ఎవరు చేయనటువంటి ఆలోచన న్యాయ దేవతకు కండ్ల కుగందలు కట్టి న్యాయం కోరుతున్న సమాజం అంటూ రాసిన వ్యాసం గొప్ప విషయమని కొనియాడారు. అదేవిధంగా దీనికి గాను కాలేజీ ప్రిన్సిపల్ ప్రశంసా పత్రాన్ని అందజేస్తూ సీనియర్ న్యాయవాది అధ్యాపకుడు కొండ యాదగిరి గౌడ్ చేతుల మీదు గా అందచేయడం జరిగింది. లీగల్ సామాజిక కార్యకర్త చండూరు మండల అడ్వైజర్ నారపాక అంజి కూడా ప్రశంసా పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు శ్రీనివాస్, ధనలక్ష్మి, వెంకట్, కాలేజీ విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. సన్మానంపై రచయిత ఐదారి శంకర్ మాట్లాడుతూ ఈ సమాజంలో మార్పు కోసం ఓ సహజమైన రచనను గొప్పగా చూడడం అనుకోకుండా ఈ న్యాయ దేవత కండ్ల కుగందలు తీయడం సమాజ మార్పులో భాగం నేను రాసిన రచన యాదృచ్ఛికంగా రావడం అదృష్టంగా భావిస్తూ కాలేజ్ యజమాన్యానికి ప్రిన్సిపల్ నక్క యాదగిరి ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా నిర్వహించిన సావిత్రిబాయి పూలే 194 వ జన్మదిన వేడుకలు



**చండూర్ జనవరి 3 (శాసనసభ న్యూస్) :** మునుగోడు మండల కేంద్రములో సావిత్రిబాయి పూలే 194 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాసనసభ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు కావడం గర్వకారణం. సామాజిక న్యాయం, విద్య, మహిళా సాధికారత కోసం పోరాటం చేసిన మహానేత సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయాలు.ఆవిడ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానతా సమాజాన్ని నిర్మించుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

# సావిత్రిబాయి జీవితం మహిళలకు ఆదదర్శం

## - సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్.

**ఇబ్రహీంపట్నం శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 3 :** సావిత్రిబాయి జీవితం మహిళలకు ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి. సామెల్ అన్నారు. శుక్రవారం నాడు పాషా, నరహరి స్మారక కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే నేటి మహిళలకు ఆదర్శమని అన్నారు.



ఆమె స్ఫూర్తితో మహిళా హక్కుల కోసం పోరాడాలన్నారు. మహిళలకు చదువు వద్దు అనే కాలంలో మహిళలకు పాఠశాలలు పెట్టి చదువు చెప్పిన చదువుల తల్లిని కొనియాడారు. బాల్య వివాహాలు, సతి సహగమనం వంటి సంఘ సంస్కరణ ఉద్యమాలు చేశారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. సమాజంలో మహిళల పైన అనేక హత్యలు, హత్యాచారాలు జరుగుతున్న శిక్షలు విధించే దాంట్లో జాప్యం జరుగుతుందన్నారు. మహిళా సాధికారిక కోసం స్వయం ఉపాధి కోసం మహిళలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వారిని హార్థిక ఎదుగుదలకు తోడ్పాటు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుగ్గరాములు, మహిళ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయమ్మ, సుమలత, అరుణ, మున్ని, ఇందిరా, సంధ్య, ఉమ, అనురాధ, సంతోష మస్తాన్ బి, లక్ష్మీ, మండల నాయకులు ప్రభుదాసు, నర్సింహ్మా, విగ్నేష్, భాస్కర్, యాదగిరి, తరంగ్, రజక్ పాషా, మహేష్, రాఘవేందర్, వంశీ, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల చదువు,అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిభాయి పూలే





**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 3 :** బ్రహ్మణీయ భావజాలాన్ని ధిక్కరించిన క్రాంతికారి సావిత్రిభాయి పూలే అని, మహిళల చదువు,అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన సావిత్రిభాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం( బి ఆర్ ఎస్ వి ) చింతపల్లి మండల అధ్యక్షులు ఆరెకంటి మురళి అన్నారు. సావిత్రిభాయి పూలే 194వ జయంతిని భారత రాష్ట్ర సమితి పార్టీ విద్యార్థి విభాగం చింతపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో చింతపల్లి మండలం వింజమూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలోని విద్యను బోధిస్తున్న మహిళా ఉపాధ్యాయురాలను శాలువలతో ఘనంగా సన్మానించడం జరిగింది. మహాత్మ జ్యోతిరావు పూలే, మహాత్మ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆరెకంటి మురళి భారత రాష్ట్ర సమితి పార్టీ విద్యార్థి విభాగం చింతపల్లి మండల అధ్యక్షులు మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలుగా పేరు గడించారన్నారు. 19వ శతాబ్దపు ఆనాటి అజ్ఞానపు చీకట్లను చీల్చుతూ బానిస సంకెళ్లను తెంచి సమాజంలో మహిళలకు, వితంతువులకు, బాలికలకు, అణగారిన వర్గాలకు విద్య, గౌరవాన్ని సాధించిన విదుషీమణి సావిత్రిబాయి అని ఆయన అన్నారు. సావిత్రిబాయి జన్మదినాన్ని జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళోద్ధరణకు సావిత్రిబాయి చేసిన సేవలు అనన్యం అసామాన్యం. సావిత్రిబాయిని భారతీయ మొదటి తరం స్త్రీవాదిగా వర్ణిస్తారన్నారు. సావిత్రీబాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో, 1831 జనవరి 3న ఒక రైతు కుటుంబంలో జన్మించిందన్నారు. సావిత్రి బాయికి 9వ యేట 12 యేండ్ల జ్యోతిరావు పూలేతో 1840లో వివాహం జరిగిందని. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు అన్నారు. జ్యోతీరావు పూలె ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. కొల్హాపూర్ లోని ఫర్రార్ ఇనిస్టిట్యూట్లో ఉపాధ్యాయ శిక్షణపొంది, 1848 లోభర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించిందని, ఇలా పాఠశాల ఏర్పాటు చేసి నడుపటం ఉన్నత వర్గాలకు నచ్చలేదన్నారు.దీంతో ఆమెపై వేధింపులకు పూనుకున్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, సతీసహగమనానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారన్నారు. మగవారికి మాత్రమే చదువుకునే పరిస్థితులలో నుండి ఆడవారు కూడా చదువుకునే స్థితికి తీసుకొచ్చిన మహా గొప్ప వ్యక్తి అని అన్నారు. సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కళాకారుడు ఆరెకంటి జగన్,గ్రామ యువ నాయకులు కొప్పుల దయానంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, మహిళా ఉపాధ్యాయురాలు రెహనా బేగం, లక్ష్మీ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు నియోజకవర్గం రోడ్ల నెట్‌వర్క్ తెలంగాణ రాష్ట్రానికి రోల్ మోడల్‌గా మారాలి!



**చండూర్ జనవరి 3 (శాసనసభ న్యూస్) :** మునుగోడు నియోజకవర్గం కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. రోడ్ల నిర్మాణం, నిర్వహణపై పలు సూచనలు అందించడంతో పాటు, గత 10 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

## ఎమ్మెల్యే కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య



**తుర్కయంజాల్,జనవరి 04(శాసన సభ ):** ఇబ్రహీంపట్నంనియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని శుక్రవారం టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కలిసి నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టెస్కాబ్ రూపొందించిన నూతన సంవత్సర డైరీని అందజేశారు.

## ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవం

- అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వాముల బంధువులతో పండగ వాతావరణం.
- చెనవమోని రాములు గురు స్వామి ఆధ్వర్యంలో 58 మంది అయ్యప్పలకు ఇరుముడి .

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 3 :**అయ్యప్ప మాలదారుల ఇరుముడి మహోత్సవం శుక్రవారం నాడు అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప గురు స్వామి చెనమోని రాములు గురుస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. సన్నిధానం ప్రాంగణం అంతా మాలాదారుల బంధువులతో పండుగ వాతావరణం నెలకొంది. 41 రోజులపాటు దీక్ష చేసి గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకుని శబరిమలై అయ్యప్ప దర్శనానికి వెళ్లడం జరుగుతుందని గురుస్వామి తెలిపారు. శుక్రవారం నాడు అయ్యప్ప సన్నిధానంలో 58 మంది అయ్యప్ప మాలదారులకు ఇరుముడి కట్టారు. సాయి సన్నిధి ఆలయ ట్రస్ట్ చైర్మన్ మంచి కంటి ధనంజయ దంపతులు అయ్యప్ప సన్నిధానానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్ప సన్నిధానానికి ప్రతి సంవత్సరం సహకారం అందిస్తున్నందుకుగాను దంపతులకు శాలువాలు కప్పి భగవంతుని ప్రతిమను ఇచ్చారు. ఈ సందర్భంగా మంచి కంటి ధనుంజయ మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక,దీక్ష కార్యక్రమాలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింబమని వాటిని ముందుకు తీసుకెళ్లడంలో అందరి భాగస్వామ్యం అవసరమని అన్నారు. అయ్యప్ప స్వామి గీతాలాపనలు, భజనలతో ఈ ప్రాంతమంతా మండలం రోజులు మారుమోగిందని, మండల దీక్ష ముగించుకుని శబరిమలై బయలుదేరుతున్న అయ్యప్ప స్వాములు ఇరుముడితో క్షేమంగా వెళ్లి రావాలని, అయ్యప్ప స్వామ కృప కటాక్షాలు మనందరిపై ఉండాలని మనసారా వేడుకున్నట్లు ఆయన తెలిపారు.రాములు గురుస్వామి మాట్లాడుతూ..... మనిషిలోని యవ్వనం,భోగం, భాగ్యం,అందం ఇవేవి శాశ్వతం కావని, అయ్యప్ప శరణమే ముక్తికి మార్గమని నాకు భవబంధాలు, భోగభాగ్యాల కన్నా అయ్యప్ప నామమే గొప్పదని భగవంతునిలో ఐక్యం కావాలని తాను మరిచిపోయి స్వామి దింతకతోమ్ - అయ్యప్ప దింతక తోమ్ అంటూ పరవశించిపోతారని అన్నారు. ఇరుముడి మహోత్సవం అనంతరం అయ్యప్ప సన్నిధానం నుండి సాయిబాబా ఆలయం వద్దకు పాదయాత్ర చేసి సాయినాథుని దర్శించుకుని, ఆలయ చైర్మన్ ధనుంజయ ఏర్పాటు చేసిన బిక్ష చేసి అనంతరం శబరిమలై కు బయలుదేరడం జరిగింది.

## వైద్య వృత్తి సేవ లాంటిది వైద్య సిబ్బంది కమిట్మెంట్తో పని చేయాలి

**70 లక్షల వ్యయంతో మర్రిగూడెంలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం**

**డయాలసిస్ కేంద్రంలో సమీప గ్రామాల పేషెంట్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి**

**కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**








**చండూర్ జనవరి 3 (శాసనసభ న్యూస్) :** మర్రిగూడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 70 లక్షల వ్యయంతో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. శాసనసభలు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. రోజురోజుకు కిడ్నీ పేషెంట్లు ఎక్కువవుతున్న నేపథ్యంలో ఈ డయాలసిస్ కేంద్రం కిడ్నీ పేషెంట్లకు ఎంతో మేలు చేస్తుందని మర్రిగూడ మండల సమీప గ్రామాల కిడ్నీ పేషెంట్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పేషంట్ల తాకిడిని బట్టి 24 గంటలు డయాలసిస్ కేంద్రం పనిచేయాలని, వైద్య సిబ్బంది షిఫ్టుల వారిగా పని చేయాలన్నారు. వైద్యం వృత్తి అనేది సేవలంటిదని వైద్య సిబ్బంది కమిట్మెంట్తో పని చేయాలని కోరారు. గ్రామాల వారీగా కిడ్నీ పేషంట్ల జాబితాను తీసుకొని రెగ్యులర్గా వాళ్లకు వైద్య సేవలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో నల్గొండ డిఎంహెచ్ఓ పుట్ట మధు, డి సి హెచ్ డాక్టర్ మాతృ, మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, ఆస్పత్రి సిబ్బంది, స్థానిక మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు సీఎం రేవంత్ అలర్ట్.. వారిని రెగ్యూలరైజ్ చేయలేం!




**శాసనసభ / హైదరాబాద్ :** ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రంలో సామాజిక మార్పును తీసుకొచ్చామని, ఆర్థికపరమైన మార్పులు తీసుకురావాలంటే ఇంకా కొంత సమయం పడుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని అన్నారు. ఉద్యోగుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, వారికి నష్టం కలిగించే పనులు ప్రభుత్వం చేయదని స్పష్టం చేశారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిని ఉద్దేశించి మాట్లాడారు.గత పదేళ్లలో పరిపాలన వ్యవస్థను భ్రష్టు పట్టించారంటూ బీఆర్ఎస్‌పై మండిపడ్డారు సీఎం రేవంత్. మేం అధికారంలోకి రాగానే పరిపాలన వ్యవస్థను పునరుద్ధరించే ప్రయత్నం చేశాం. తెలంగాణ ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీ నెల మొదటి తారీఖు జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ ప్రభుత్వం కష్టకాలంలో బాధ్యతలు చేపట్టిందన్నారు.ఆర్థిక పరిస్థితుల వల్ల ప్రభుత్వానికి ఆదాయం లేకపోవడంతో కొన్ని సమస్యలను పరిష్కరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వంలో కనీస అవసరాలకు ప్రతీ నెల రూ. 22,500 కోట్లు అవసరం ఉండగా, రూ. 18,500 కోట్లు మాత్రమే ఆదాయం వస్తోంది. ఇంకా రూ. 4,000 కోట్ల లోటు ఉంటోంది. వచ్చే ఆదాయంలో రూ.6,500 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అవసరాలకు చెల్లిస్తున్నాం. మరో రూ. 6,500 కోట్లు ప్రతి నెల అప్పులు చెల్లిస్తుండగా, మిగిలిన రూ. 5,500 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ వివరించారు.నిజానికి ప్రభుత్వం అన్నీ సక్రమంగా నిర్వహించాలంటే నెలకు రూ. 30 వేల కోట్లు అవసరం ఉంటుంది. ఈ ప్రభుత్వం మనందరిది. ఆదాయాన్ని పెంచుకునేందుకు ఉద్యోగుల సహకారం కావాలి. సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ధర్నాలు, ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి. ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకుని ఒక కార్యాచరణ ప్రకారం ప్రభుత్వం పరిష్కరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.కొందరు రాజకీయాల కోసం నిరసనలు, ధర్నాలకు ప్రేరేపిస్తున్నారని, అలాంటివారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ సూచించారు. సర్వశిక్షా అభియాన్ కేంద్ర ప్రభుత్వ పథకం కింద పనిచేస్తోంది. అందులో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధం చేసే అవకాశం లేదు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఉన్నా ప్రభుత్వానికి చేయలేని పరిస్థితి. నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేస్తే న్యాయస్థానాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సీఎం రేవంత్ చెప్పారు.ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నాయిని రాజేందర్‌తో పాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులు ప్రమాణాలు చేయాలా?




**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతుబంధు ఎగ్గొట్టేందుకు రేవంత్ సర్కారు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ మాజీ సీఎం కేటీఆర్ రైతుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకున్నారన్నారు.గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు పంపిణీలో రూ. 22 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేతలు.. ఆ డబ్బు ఎక్కడికి వెళ్లిందో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పత్తి, కంది, చెరుకు రెండో పంట ఉండదని, అయినా రైతుబంధు ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 26,500 కోట్లు ఎగ్గొట్టిందన్నారు. రైతుబంధు పేరిట ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.రైతును రాజును చేస్తామని ఎన్నికల ముందు చెప్పారని, రైతు డిక్లరేషన్ పేరుతో చాలా హామీలు ఇచ్చారంటూ కాంగ్రెస్ నేతలపై ధ్వజమెత్తారు. ప్రజా పాలనలో 1.6 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. రైతు శాసించాలని కేసీఆర్ అంటే.. యాచించాలని కాంగ్రెస్ అంటోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వానా కాలంలో ఎగ్గొట్టిన రైతుబంధును కూడా ఇవ్వాల్సిందేనని అన్నారు. రైతులందరికీ రైతుభరోసా ఇవ్వకపోతే రేవంత్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 11 సార్లు రైతుబంధు వేశాక మళ్లీ ఇప్పుడు దరఖాస్తులు ఎందుకని ప్రశ్నించారు. గ్రామాల వారీగా రుణమాఫీ జాబితాలు పెట్టాలని, రైతుభరోసా ఎవరికి ఇస్తారో స్పష్టంగా చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా రైతు భరోసా ఇవ్వాలన్నారు.రైతుల నుంచి ప్రమాణపత్రాలు, దరఖాస్తులు అనే పనికిమాలిన మాటలు ఆపేయాలన్నారు కేటీఆర్. శనివారం (డిసెంబర్ 4) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. రైతుబంధు మంటే చూస్తూ ఊరుకోబోమని కేటీఆర్ హెచ్చరించారు. ప్రభుత్వం మెడలు వంచైనా రైతుబంధు ఇప్పిస్తామన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## వణికిస్తున్న చలి పులి.. సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు...



**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణా రాష్ట్రాన్ని చలి వణికిస్తుంది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ కు పడిపోయాయి. రాష్ట్రంలో చలి కారణంగా ప్రజలు గజగజ వణుకుతున్నారు.ఉదయం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా సింగల్ డిజిట్ కు చేరుకోవడంతో విపరీతంగా పెరిగిన చలితో అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సైతం సలహా ఇస్తున్నారు.రాష్ట్రంలో బాగా పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో అత్యల్పంగా ఆసిఫాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రత నమోదయింది. జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గడంతో ఒక్కసారి చలి పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో అత్యల్పంగా తిర్యాని మండలం గిన్నెదరి, సిర్పూర్(యు) లో 6.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, తిర్యాని లో 7.9 డిగ్రీల, కెరమెరి లో 9.3 డిగ్రీలు, దనోరా 9.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయింది.రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాలలో సింగిల్ డిజిట్ లో ఉష్ణోగ్రతలు రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో చలి విజృంభిస్తుంది. మెదక్ జిల్లా టేక్మాల్ లో 9.3 డిగ్రీల ఉష్ణోగ్రత, నర్సాపూర్లో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో ఈరోజు అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తాజాగా సంగారెడ్డి కోహీర్ లో లో 6.9 డిగ్రీల ఉష్ణోగ్రత, సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 11.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, జిల్లాలోని న్యాల్ కల్ 7.7, ఆల్గోల్ 7.6, కోహీర్ 6.9 సెంటిగ్రేడ్ ల ఉష్ణోగ్రత నమోదయింది..

# నిమిష ప్రియ కేసు.. స్పందించిన విదేశాంగ శాఖ



**శాసనసభ / హైదరాబాద్ :** యెమెన్‌లో ఓ హత్యా నేరంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న భారతీయ నర్స్ నిమిష ప్రియకు మరణశిక్ష ఖరారైంది. ఆమెను విడిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.దీనిపై తాజాగా విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. "నిమిష ప్రియ కేసులో మేం పరిణామాలన్నింటినీ సునిశితంగా పరిశీలిస్తున్నాం. ఈ కేసులో ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తోంది" అని తెలిపారు. కాగా.. నిమిషను విడిపించాలని ఆమె కుటుంబం కేంద్రాన్ని అభ్యర్థిస్తోంది. యెమెన్ దేశ అధ్యక్షుడి నిర్ణయంతో ఆమెకు నెల రోజుల లోపులో మరణశిక్ష అమలయ్యే అవకాశాలు ఉన్నాయని ఇదివరకే పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి.మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు ను పదవి నుంచి దింపేందుకు అక్కడి ప్రతిపక్షాలు కుట్ర చేశాయని అందులో భారత్ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ యూఎస్ మీడియా ప్రచురించిన కథనాన్ని విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అందులో ఎలాంటి విశ్వసనీయత లేదని పేర్కొంది. ముయిజ్జును అభిశంసించేందుకు ఆయన సొంత పార్టీలోని 40 మంది ఎంపీలకు కూడా లంచం ఇవ్వాలని అక్కడి ప్రతిపక్ష పార్టీ మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ యత్నించిందని, అందుకోసం భారత్ నుంచి 6 మిలియన్ల డాలర్ల సాయం కోరిందని ఆ కథనం సారాంశం.

# రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వమిది:కిషన్ రెడ్డి



**శాసనసభ / హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతల్లో మార్పు వచ్చింది తప్ప, తెలంగాణ ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు.ప్రజా ప్రభుత్వం కాదు, ప్రజలను మోసం చేసే ప్రభుత్వమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ చేతల ప్రభుత్వం కాదని, మాటల ప్రభుత్వం, కోతల ప్రభుత్వమని, రైతు భరోసాలో కోతలు పెట్టే కుట్రలు చేస్తోందని విమర్శించారు.రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు ఎంతమంది ఉన్నదీ ప్రభుత్వం దగ్గర డేటా ఉందని, దద్దమ్మ ప్రభుత్వం కాకపోతే రైతుల నుండి దరఖాస్తులు ఎందుకు తీసుకుంటుందని ఆయన ప్రశ్నించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు అమలు చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అనేక హామీలు గుప్పించి రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ది ప్రజాప్రభుత్వం కాదని, ప్రజలను మోసం చేసే ప్రభుత్వమని అన్నారు.**ఫసల్ భీమా ప్రస్తావనే లేదు** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఫసల్ బీమా ప్రస్తావనే లేదని, రైతు భరోసా కింద ఒక్క రూపాయి కూడా ఇంతవరకు ఇవ్వలేదని కిషన్ రెడ్డి విమర్శించారు. రైతుల మీద అక్రమ కేసులు పెట్టి, రైతులకు సంకెళ్లు వేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుడు బీఆర్ఎస్ రైతులకు సంకెళ్లు వేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతులకు అండగా ఉందని, నవంబర్ 30న నాలుగో విడత రుణమాఫీ చేస్తున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించారని అన్నారు. ఆ డబ్బులు ఇంకా రైతుల అకౌంట్ లలో చేరలేదని,ఇంకా నాలుగు సంవత్సరాలైనా రుణమాఫీ కాదని ఆయన సెటైర్లు వేశారు. కనీస మద్దతు ధర కొన్ని పంటల మీద 80 శాతం మోడీ ప్రభుత్వం పెంచిందని, కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తున్నా ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇది నేరపూరిత చర్యగా కిషన్ రెడ్డి అభివర్ణించారు. ప్రైవేట్ రైస్ మిల్లర్‌లతో ఒప్పందం కుదుర్చుకుని రైతులకు అన్యాయం చేస్తుందని, రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి అధికారుల మీద అజమాయిషీ లేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.ఎరువుల సబ్సిడీకి కేంద్రం రూ.33 వేల కోట్ల వ్యయం తెలంగాణలో ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తోందని అన్నారు. ఎరువుల ధరలు పెరిగినా, కేంద్రం ఏనాడూ రైతులపై భారం వేయలేదని అన్నారు. పెరిగిన భారమంతా కేంద్రమే భరిస్తోందని తెలిపారు. కేంద్రం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. బీజేపీ హయాంలోనే ఎరువుల కొరత లేని పరిస్థితులు చూస్తున్నామని వివరించారు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచుతోందని విమర్శించారు. రైతులు పండించే పంట మొత్తాన్ని కేంద్రమే కొనుగోలు చేస్తోందని అన్నారు. కేజీ బియ్యాన్ని రూ.40కి కొనుగోలు చేసి పేదలకు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ కోతలు లేని పరిస్థితి తీసుకొచ్చిందని తెలిపారు.

# కేంద్రం ఢిల్లీలో ఏ పనీ చేయలేదు

**శాసనసభ / హైదరాబాద్ :** బిజెపి నేతృత్వంలోని కేంద్రం ఢిల్లీలో అభివృద్ధి పని ఏదీ చేయలేదని, చేసి ఉంటే ప్రధాని నరేంద్ర మోడీ రాజధాని ప్రజలను. అతిపెద్ద తీర్పుతో వారు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని దూషించేందుకు తన 43 నిమిషాల ప్రసంగంలో 39 నిమిషాలు వెచ్చించి ఉండేవారు కాదని ఆప్ సుప్రీమో అర్వింద్ కేజ్రీవాల్ శుక్రవారం ప్రత్యారోపణ చేశారు.మరొక వైపు, మోడీజీ తన ప్రసంగంలో చెప్పి ఉండే పని ఏదీ బిజెపి ప్రభుత్వం చేయలేదు. అది ఏదైనా కృషి చేసి ఉన్నట్లయితే, ఆయన ఢిల్లీ ప్రజలను నిందించి ఉండేవారు కాదు. ఢిల్లీ వాసులను దూషించడం ద్వారా ఎన్నికల్లో విజయానికి ఆ పార్టీ అంతగా ప్రయత్నం చేయవలసిన అవసరం ఉండేది కాదు' అని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అన్నారు. మోడీ శుక్రవారం ఉదయం అశోక్ విహార్‌లో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆప్‌ను ఢిల్లీకి 'ఆపద'గా పేర్కొన్నారు. ఈ 'ఆపద' గత 10 ఏళ్లలో దేశ రాజధానిని తన గుప్పిట్లోకి తీసుకుందని మోడీ ఆరోపించారు. వచ్చే నెల జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందనే దృఢవిశ్వాసాన్ని కూడాప్రధాని వ్యక్తం చేశారు.

# లద్దాఖ్‌లో కొత్తగా చైనా కౌంటీలు.. భారత్ తీవ్ర అభ్యంతరం




**శాసనసభ / హైదరాబాద్ :** లద్దాఖ్‌లోని సరిహద్దు ప్రాంతంలో చైనా రెండు స్థావరాలను ఏర్పాటు చేయడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ ప్రాంతంలో చైనా ఆక్రమణలను ఎన్నడూ అంగీకరించబోమని స్పష్టం చేసింది.ఇటువంటి చట్ట విరుద్ధ,బలవంతపు ఆక్రమణలు చేయడం వల్ల వాటికి చట్టబద్ధత కల్పించినట్లు కాదని పేర్కొంది. ఇదే అంశంపై దౌత్యమార్గాల ద్వారా చైనాకు తమ నిరసన వ్యక్తం చేసినట్లు భారత విదేశాంగశాఖ వెల్లడించింది. "చైనాలోని హెటాన్ ప్రాంతంలో కొత్తగా రెండు కౌంటీల నిర్మాణానికి సంబంధించిన ప్రకటన చూశాం. ఈ కౌంటీల్లో కొంత భాగం లద్దాఖ్ పరిధిలోకి వస్తుంది. ఈ ప్రాంతంలో భారత భూభాగాన్ని చైనా ఆక్రమించడాన్ని ఎన్నడూ అంగీకరించం. ఈ కొత్త కౌంటీల ఏర్పాటు అనేది ఈ ప్రాంతంలో భారత్‌కు దీర్ఘకాలంగా, స్థిరంగా ఉన్న సార్వభౌమాధికారంపై ఎటువంటి ప్రభావం చూపదు. ఇలా చట్టవిరుద్ధమైన, బలవంతపు ఆక్రమణలతో చట్టబద్ధత లభించదు" అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు.టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ డ్యామ్‌ను నిర్మించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో భారత్ తొలిసారి స్పందించింది. దీనిపై పర్యవేక్షణ కొనసాగిస్తామని, తమ దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఎగువ ప్రాంతాల్లో నిర్మించే ప్రాజెక్టుల వల్ల దిగువన ఉన్న ప్రాంతాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాకు సూచించింది.ఈ అంశంలో పారదర్శకతతో పాటు దిగువ దేశాలతో సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. బ్రహ్మపుత్రను టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బో అంటారు. దీనిపై 13,700 కోట్ల డాలర్ల వ్యయంతో బృహత్తర డ్యామ్‌ను నిర్మించాలని చైనా ఇటీవల నిర్ణయించింది. హిమాలయాల్లో టిబెట్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌కు వంపు తిరిగే చోట బ్రహ్మపుత్రపై ఈ డ్యామ్‌ను నిర్మిస్తారు. దీనివల్ల అరుణాచల్‌తోపాటు అస్సాం రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలు ఉన్నాయి. రెండు దేశాల మధ్య సంఘర్షణ సంభవిస్తే చైనా ఈ డ్యామ్ నుంచి ఒక్కసారిగా భారీ పరిమాణంలో నీటిని విడుదలచేస్తే అక్కడి భూభాగాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని భారత్ ఆందోళన చెందుతోంది.

# నేడే సచివాలయం ఎన్నికలు



**శాసనసభ / హైదరాబాద్ :** డా.బిఆర్.అంబేద్కర్ తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్ అసోసియేషన్ ఎన్నికలు నేడు జరగనున్నాయి. ఈ ఎన్నికలను సచివాలయ ఉద్యోగులు సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.ఈ నేపథ్యంలోనే ఈ ఎన్నికల్లో తామే గెలవాలని పలు శాఖల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. మొత్తం సచివాలయం నుంచి 1,101 మంది ఓటర్లు ఉండగా అందులో సచివాలయం నుంచి 999 మంది, అసెంబ్లీ నుంచి 100 మంది, రాజ్‌భవన్ నుంచి 2 ఓటర్లతో మొత్తం 1,101 మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. దీనికి సంబంధించిన ఎన్నికలు నేడు జరగనున్నాయి. రికార్డు అసిస్టెంట్ నుంచి అడిషనల్ సెక్రటరీ వరకు ఈ ఓటింగ్‌లో పాల్గొనడానికి అర్హులు. ఈ నేపథ్యంలోనే పలు శాఖల నుంచి అభ్యర్థులు భారీగా పోటీ పడుతున్నారు.ఈ పోటీ నేపథ్యంలో పలు శాఖల తరపున తామే గెలవాలన్న ఉద్దేశ్యంతో ఆయా శాఖల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందులో భాగంగా రహస్య సమావేశాలను నిర్వహించడంతో పాటు కుల, మతం, ప్రాంతం, వర్గాలుగా విడిపోయి ఈ ప్రచారాన్ని నిర్వహించారు. సచివాలయంలోని జిఏడిలో 193 మంది ఓటరులతో సచివాలయంలోని పెద్ద శాఖగా ఉండగా, ఫైనాన్స్ 115 ఓటర్లతో రెండోస్థానం, మండలి, అసెంబ్లీ 91 ఓటర్లతో మూడోస్థానంలో ఉన్నాయి. ఇక రెవెన్యూ 76 ఓటర్లు, ఆర్ అండ్ బి 53, పంచాయతీరాజ్ 52, ఐ అండ్ సిఏడి 47, హోంశాఖ 39, ఎంఏయూడి 34, ఏ అండ్ సి 31 ఓటర్లు,వైద్య ఆరోగ్య శాఖ 29 ఓటర్లు, ప్లానింగ్ నుంచి 28 ఓటర్లు, స్కూల్ ఎడ్యుకేషన్ 28 ఓటర్లు, ఎస్సీ డెవలప్‌మెంట్ 27 ఓటర్లు, ఐఎన్‌డి అండ్ సిఎం 27 మంది ఓటర్లు, లా 26, హయ్యర్ ఎడ్యుకేషన్ 20, పశుసంవర్ధక శాఖ 20, ఈఎఫ్ఎస్ అండ్ టి 19, విద్యుత్ శాఖ 18, గిరిజన సంక్షేమ శాఖ 15, వైఏటి అండ్ సి 14, ఎల్ఈటి అండ్ ఎఫ్ 14, మైనార్టీ వెల్ఫేర్ 14, బిసి వెల్ఫేర్ 12, డబ్లూసిడి అండ్ ఎస్సీ 11, సిఏఫ్ అండ్ సిఎస్ 06, ఐటిఈ అండ్ సి 03, పబ్లిక్ ఎంటర్ ప్రైజేస్ 03, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నుంచి ముగ్గురు ఓటర్లు ఉన్నారు.ప్రెసిడెంట్ పదవి కోసం 9 మంది పోటీ అయితే నేడు జరిగే ఎన్నికల్లో ప్రెసిడెంట్ పదవి కోసం 9 మంది, వైస్ ప్రెసిడెంట్ (జనరల్) పదవి కోసం 6 మంది, వైస్ ప్రెసిడెంట్ (ఉమెన్) పదవి కోసం 6, జనరల్ సెక్రటరీ పదవి కోసం 6, అడిషనల్ సెక్రటరీ పదవి కోసం 6, జాయింట్ సెక్రటరీ (ఆర్గనైజింగ్) పదవి కోసం 7, జాయింట్ సెక్రటరీ (ఉమెన్) పదవి కోసం 5, జాయింట్ సెక్రటరీ (స్పోర్ట్) పదవి కోసం 5, జాయింట్ సెక్రటరీ (కల్చరల్) పదవి కోసం 4, జాయింట్ సెక్రటరీ (పబ్లిసిటీ) పదవి కోసం 8, ట్రెజరర్ పోస్టు కోసం 5 మంది మొత్తంగా 66 మంది 11 పదవుల కోసం పోటీ పడుతున్నారు. నేడు రాత్రిలోగా ఈ ఎన్నికలు ఫలితాలు వెల్లడవుతాయని అధికారులు తెలిపారు.

# మాది మాటల ప్రభుత్వం కాదు..చేతల సర్కార్:మంత్రి పొంగులేటి



**శాసనసభ / హైదరాబాద్:** తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల సర్కార్ అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. సుజాతనగర్ మండలం, వేపలగడ నుంచి బృందావనం వరకు ఆర్‌అండ్‌బి నిధులు రూ.2 కోట్ల వ్యయంతో మూడు కిలోమీటర్ల వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎంఎల్ఎల కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ%ొ% ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముందుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉందని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నిలుపుతామని అన్నారు.అనంతరం కొత్తగూడెం శ్రీ రామచంద్ర కళాశాలలో సావిత్రిబాయి పూలే జన్మదినం సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ%ొ% ప్రతి సంవత్సరం జనవరి మూడో తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో భాగంగా రూ.657 కోట్ల వ్యయంతో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించామన్నారు. జిల్లాలోని రామవరం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం కృషి చేస్తానని, అందుకోసం కొత్తగూడెం రుద్రంపూర్ ప్రాంతంలోని సింగరేణి, అటవీ, ప్రైవేట్ భూములను ఏర్పాటు చేసుకొని రాబోవు ఆరు నెలల్లో కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగూడెంలో ఇండోర్ స్పోర్ట్ స్టేడియం కోసం కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం హాస్టళ్లలో చదువుకున్న పేద విద్యార్థులకు కనీసం భోజనం పెట్టలేని పరిస్థితి.. నేడు ఇందిరమ్మ రాజ్యంలో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక చొరవ జిల్లాలో విస్తృతంగా పర్యాటక రంగం అభివృద్ధి చేయాలనే ప్రత్యేక ఆలోచనలతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చొరవతో ఈ ఏరు పండగను రూపొందించామని అన్నారు. ఈ పండుగను ఈనెల 9న వైకుంఠ ఏకాదశి శుభదినం సందర్భంగా, ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ప్రారంభం సందర్భంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏరు అనేది ఈ జిల్లాలో మాట్లాడే గిరిజన భాషలో నీరు అని అర్థం. ఈ పేరు గోదావరి నది, ఘాట్ల చుట్టూ నివసించే వేడుకలను ప్రతిబింబించేందుకు ఎంపిక చేశారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆలోచనలో భాగంగా ఈ పండుగ భద్రాచలం ఆలయం, గోదావరి నది బోటింగ్,కనకగిరి శిఖరం, గిరిజన గ్రామ అనుభవం, కిన్నెరసాని డ్యాం, జింకల పార్కు లాంటి పర్యాటక ప్రదేశాలపై దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

# మెడికల్ సీట్లు ఖాళీగా ఉంచొద్దు



మెడికల్ సీట్లకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్లు ఖాళీగా ఉండటానికి వీల్లేదని పేర్కొంది.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలతో సహా ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీనిపై ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.వైద్య విద్యకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో దాదాపు వెయ్యికి పైగా సీట్లు ఖాళీగా ఉండటంపై ఏప్రిల్ 2023లో సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఓ వైపు సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వైద్యుల కొరత ఉండటం, మరోవైపు ఇలా సీట్లు మిగిలిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలు, ప్రైవేటు మెడికల్ కాలేజీల ప్రతినిధులతో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తాజాగా కొన్ని సిఫార్సులు చేయడంతో ఇదే విషయాన్ని సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది.ఈ అంశానికి సంబంధించిన పిటిషన్‌ను నేడు విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం.. మెడికల్ సీట్లు ఖాళీగా ఉండకూడదని స్పష్టం చేసింది. వివిధ భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేసి, ఆ తర్వాత ఓ కచ్చితమైన ప్రతిపాదనతో వస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించిన న్యాయస్థానం.. మూడు నెలల్లో పూర్తి చేయాలని పేర్కొంటూ తదుపరి విచారణ ఏప్రిల్‌లో చేపడతామని తెలిపింది.

# తెలంగాణను స్పోర్ట్ హబ్ గా మారుస్తాం: మంత్రి శ్రీధర్ బాబు



**శాసనసభ / హైదరాబాద్ :** బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడిగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పుల్లెల గోపిచంద్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన మంత్రి శ్రీధర్ బాబును సచివాలయంలో కలుసుకుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఒక క్రీడాకారుడిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్ హబ్ గా మార్చాలని పట్టుదలతో ఉన్నారని తెలిపారు. దక్షిణ కొరియాలోని ఒక చిన్న స్పోర్ట్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు ఇటీవల జరిగిన ప్యారిస్ ఒలింపిక్స్ లో 37 పతకాలు సాధించారని, ఈ స్ఫూర్తితోనే తెలంగాణలోనూ స్పోర్ట్ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నట్లు మంత్రి తెలిపారు. అకడమిక్స్‌తో క్రీడలను మిళితం చేస్తూ విద్యార్థి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దుతూ.. ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్ పాలసీకి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు.ఈ ప్రక్రియలో విద్యావేత్తలు, ప్రముఖ క్రీడాకారులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అని మంత్రి వివరించారు. తెలంగాణలో ప్రతిభకు కొరత లేదు. క్రీడల్లో సత్తా చాటుతూ గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో స్పోరట్స్ యూనివర్సిటీ అనుబంధ కేంద్రాలు, స్పోర్ట్ హబ్స్ ఏర్పాటు చేస్తామని. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ అకడమిక్, స్పోర్ట్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి వివరించారు. పేదలు, ధనికుల మధ్య తారతమ్యాలు లేకుండా సమ్మిళిత వృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. కొత్త పాఠశాలలకు అనుమతులిచ్చే ప్రక్రియలో మార్పులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. పాఠశాల ఆవరణలో క్రీడామైదానం ఉంటేనే ఇకపై అనుమతులు ఇస్తామన్నారు. అందరూ కలిస్తేనే క్రీడలను అభివృద్ధి చేయగలమని, ప్రభుత్వం తరపున క్రీడాకారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.ఒలంపిక్ సంఘం, ఇతర సంఘాలు, అకాడమీలను కలుపుకుని ముందుకు వెళ్తామని చెప్పారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పుల్లెల గోపిచంద్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం సహకరిస్తేనే క్రీడలు అభివృద్ధి చెందుతాయని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. స్పోర్ట్ యూనివర్సిటీ, స్పోర్ట్ పాలసీ తీసుకురావడం నిజంగా గొప్ప ప్రయత్నం అని అన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆలిండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్(అండర్ %-% 19 ఇయర్స్) ను గచ్చిబౌలిలోని గోపిచంద్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లుగా వివరించారు.

# నుమాయిష్ షురూ.. పాల్గొన్న మంత్రులు

**శాసనసభ / హైదరాబాద్:** ప్రతి సంవత్సరం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే నుమాయిష్ ఈ ఏడాది కూడా ప్రారంభమైంది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)2025ను మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, పీసీసీ చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ విహెచ్, ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జనవరి 1న ప్రారంభం కావాల్సి ఉండగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి వల్ల ఈరోజు ప్రారంభం అవుతుందని, జమ్మూ నుండి ఇతర రాష్ట్రాల్లో ఎక్కడికి వెళ్లి కొనుక్కోవాలనుకున్న ఇక్కడే ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నుమాయిష్ లో దొరుకుతాయన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్.గతంలో ఎనిమల్ కంపీటిషన్ జరుగుతుండే దానిని మళ్ళీ ప్రారంభించాలని కోరారని, పాడి పంటలను ఎంకరేజ్ చేయాలన్నారు. విద్యా సంస్థలను ప్రోత్సహించడం లాంటివి ఈ కమిటీ చేస్తుంది ఇక్కడ నుమాయిష్ కార్యక్రమం జరుగుతుందని, నుమాయిష్ కి ప్రభుత్వ సహకారంతో మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్.

శాసనసభ
శనివారం 04 జనవరి - 2025




## అల్లు అర్జున్‌కు బెయిల్
## మంజూరు చేసిన నాంపల్లి కోర్టు

సినీనటుడు అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియగా..నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. రూ.50వేల రెండు పూచీకత్తులను సమర్పించాలని, పోలీసుల విచారణకు సహకరించాలని, ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని, సాక్షులను ప్రభావితం చేయొద్దని.. కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసినట్టు అల్లు అర్జున్ తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి తెలిపారు.'పుష్ప2' బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌పై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడంతో పోలీసులు ఆయన్ను జైలుకు తరలించారు. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో అల్లు అర్జున్ విడుదలయ్యారు.మరోవైపు నాంపల్లి కోర్టు విధించిన రిమాండ్ ముగియడంతో ఆయన వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అదే రోజు అల్లు అర్జున్ తరపు న్యాయవాదులు రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన నాంపల్లి కోర్టు ఇవాళ తీర్పు వెలువరించింది.

## నేను రాజకీయాలకు దూరంగా ఉంటా: రేణు దేశాయ్



సావిత్రి బాయి పూలే 194వ జయంతి సందర్భంగా నేడు విజయవాడలో పార్టీ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటి రేణు దేశాయ్ పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు.'మహిళల విద్య కోసం సావిత్రబాయి పూలే ఎంతో కృషి చేశారు. నేను రాజకీయాలకు దూరంగా ఉంటాను. సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం అని చెబితే వచ్చాను' అని ఆమె అన్నారు.రేణూ దేశాయ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తన ఎన్జీవో పనుల గురించే మాత్రమే పోస్టులు వేస్తున్నారు. నెటిజన్లు చేసే నెగెటివ్ కామెంట్లకు ఎక్కువగా రియాక్ట్ అవ్వడం లేదు. గతంలో అయితే నెటిజన్లతో ఎక్కువగా వాదిస్తూ ఉండేవారు. ప్రతీ ఒక్కరికీ సమాధానాలు ఇస్తుండేవారు. కానీ రేణూ దేశాయ్ ఇప్పుడు అవన్నీ టైం వేస్ట్ పనులని అనుకుని ఉంటారు. తన పూర్తి సమయాన్ని పిల్లలు, పెట్స్ కోసమే కేటాయిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఇక ఇప్పుడు ఆద్య పేరు మీద పెట్టిన ఎన్జీవో పనులతోనే బిజీగా ఉంటున్నారు. మరి బుల్లితెరపై గానీ, వెండితెరపై గానీ రేణూ దేశాయ్ ఎలాంటి ప్రాజెక్టులు చేస్తున్నట్టుగా కనిపించడం లేదు.

## మణిరత్నం మూవీ ఆఫర్..
## బ్రాహ్మణి నో చెప్పింది: బాలకృష్ణ



తన పెద్ద కుమార్తె బ్రాహ్మణి గురించి సినీనటుడు బాలకృష్ణ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తాను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'అన్‌స్టాపబుల్' లో నాటి సంగతులు నెమరువేసుకున్నారు.ఆ షో సీజన్ 4.. ఎపిసోడ్ 8లో దర్శకుడు బాబీ , సంగీత దర్శకుడు తమన్ , నిర్మాత నాగవంశీ అతిథులుగా పాల్గొని సందడి చేశారు. 'మీ ఇద్దరి అమ్మాయిల్లో ఎవరిని గారాబంగా పెంచారు?' అని తమన్ అడగ్గా బాలకృష్ణ స్పందించారు. ఇద్దరినీ గారాబంగానే పెంచానని చెబుతూ మణిరత్నం సినిమా అవకాశాన్ని గుర్తుచేసుకున్నారు."మణిరత్నం గారు అప్పట్లో ఓ సినిమా కోసం హీరోయిన్‌గా బ్రాహ్మణిని అడిగారు. ఆ విషయాన్ని ఆమెకు చెబితే.. 'మై ఫేస్' (నా ముఖం) అని సమాధానమిచ్చింది. నీ ఫేస్ కోసమే అడుగుతున్నారని అన్నా. చివరకు ఆసక్తి లేదని చెప్పా. తేజస్విని మాత్రం అద్దంలో చూసుకుంటూ యాక్ట్ చేసేది. తనైనా నటి అవుతుందని అనుకున్నా. చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఈ షోకు ఆమె క్రియేటివ్ కన్సల్టెంట్. ఎవరి రంగంలో వారు మంచి పేరు తెచ్చుకున్నారు. 'వాళ్ల తండ్రిని నేను' అని చెప్పుకొనే స్థాయికి ఎదిగారంటే అంతకుమించి నాకు కావాల్సింది ఏముంది. నేను భయపడేది బ్రాహ్మణికే" అని అన్నారు.దేవిశ్రీ ప్రసాద్ ఇష్టమా? నేను ఇష్టమా? అని తమన్ అడగ్గా తమన్ అంటూ బాలకృష్ణ బదులిచ్చారు. యాక్టర్ కంటే హోస్ట్‌గా ఉండడం ఇష్టమని మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. దర్శకులు బాబీ, బోయపాటి శ్రీనుల్లో.. ఇద్దరూ ఫేవరెట్ అని చెప్పారు. యాక్షన్ సీక్వెన్స్ కంటే రొమాంటిక్ సీన్స్ ఇష్టమన్నారు. బాలకృష్ణ హీరోగా బాబీ రూపొందించిన 'డాకు మహారాజ్'కు నాగవంశీ నిర్మాత. తమన్ సంగీతం అందించారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో యూఎస్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను శనివారం నిర్వహించనున్నారు.

## తండ్రి లైంగిక వేధింపులు..
## షూట్‌కు వచ్చి కొట్టేవాడు: ఖుష్బూ



తన తండ్రి వల్ల లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ ఇప్పటికే పలు సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే.తాజాగా ఆమె మరోసారి ఇదే విషయాన్ని తెలియజేశారు. ఆయన వల్ల తన కుటుంబం ఎన్నో సమస్యలు చూసిందని అన్నారు. తన తల్లి, సోదరులను ఆయన చిత్రహింసలు పెట్టేవాడని తెలిపారు. తనపై జరుగుతున్న లైంగిక దాడి గురించి బయటకు చెబితే ఎక్కడ తన వాళ్లను ఇంకా నరకయాతన పెడతాడోనని భయపడి తాను చాలాకాలం ఈ దారుణాన్ని బయటపెట్టలేదని ఆమె వివరించారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన తర్వాతే తాను ధైర్యంగా బదులివ్వడం నేర్చుకున్నానని అన్నారు. ఆయనకు ఎదురుతిరిగిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. అది తట్టుకోలేక ఆయన షూటింగ్ ప్రదేశానికి వచ్చి అందరి ముందు కొట్టేవాడని ఆమె చెప్పారు."చిన్నతనంలోనే నేను లైంగిక దాడిని ఎదుర్కొన్నా. నా తండ్రే నాపై ఈ దారుణానికి పాల్పడ్డాడు. నా తల్లి, సోదరులను చిత్రహింసలు పెట్టేవాడు. బెల్టు, చెప్పులు, కర్ర.. ఇలా చేతికి ఏది దొరికితే దానితో కొట్టేవాడు. కొన్నిసార్లు అమ్మను మరీ దారుణంగా హింసించేవాడు. ఆమె తలను గోడకు కొట్టేవాడు. చిన్నతనంలోనే నేను ఇలాంటి దారుణమైన వేధింపులు చూశా. నాపై జరుగుతోన్న దాడి గురించి బయటకు చెబితే వాళ్లను ఇంకెంత నరకయాతనకు గురి చేస్తాడోనని భయపడ్డా. అందుకే మొదట్లో ఏమీ మాట్లాడలేక ఎన్నో దారుణాలు భరించా. చెన్నైకు వచ్చి నా కాళ్లపై నేను నిలబడిన తర్వాత నాలో ఆత్మస్థైర్యం పెరిగింది. ఆ తర్వాతే ఆయనకు ఎదురుతిరగడం మొదలుపెట్టా. దాన్ని ఆయన తట్టుకోలేకపోయాడు. షూట్‌కు వచ్చి అందరిముందు నన్ను బాగా కొట్టేవాడు. ఉబిన్ అనే ఒక హెయిర్‌డ్రెస్సర్ నాకెంతో సాయం చేసింది. నాతో ఆయన ప్రవర్తన సరిగ్గా లేదని ఆమె గుర్తించింది. నా నుంచి విషయం తెలుసుకొని ధైర్యం చెప్పింది. అలా మొదటిసారి 14 ఏళ్ల వయసు ఉన్నప్పుడు లైంగిక వేధింపుల గురించి బయటకు వచ్చి మాట్లాడా. ఆ తర్వాత ఆయన మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయాడు. ఎక్కడికి వెళ్లాడో మాకు తెలియదు. నేను కనుక్కోవాలనుకోలేదు. ఆ తర్వాత ఎప్పుడూ ఆయన్ని కలవలేదు. గతేడాది ఆయన మరణించాడని తెలిసినవాళ్లు చెప్పారు" అని ఖుష్బూ తెలిపారు.



## ఆ విషయాల్లో 'సంక్రాంతికి వస్తున్నాం' నా తొలి చిత్రం: మీనాక్షి చౌదరి

2024లో చిత్ర పరిశ్రమలో ఎక్కువగా వినిపించిన పేరు మీనాక్షి చౌదరి. తెలుగు, తమిళ్‌లో ఆరు చిత్రాలతో సందడి చేశారామె.ఈ సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'తో మరోసారి ప్రేక్షకులను పలకరించనున్నారు. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' తర్వాత హీరో వెంకటేశ్, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబోలో రూపొందిన చిత్రమిది. ఐశ్వర్యా రాజేశ్ మరో హీరోయిన్. సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా మీనాక్షి విలేకరులతో ముచ్చటించారు. ఆమె పంచుకున్న విశేషాలివీ..అప్పుడు 'గుంటూరు కారం'తో.. "సంక్రాంతికి వస్తున్నాం'లో నేను ఓ భాగమవడం సంతోషంగా ఉంది. కామెడీ జానర్ మూవీలో నటించడం ఇదే తొలిసారి. యాక్షన్ సీక్వెన్స్ చేయడమూ ఇదే ఫస్ట్‌టైమ్. వినోదాత్మకంగా సాగే కాప్ రోల్ ప్లే చేయడం కొత్త అనుభూతి. 2024 సంక్రాంతికి నేను నటించిన 'గుంటూరు కారం' విడుదలైంది. ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం'. ఈ ప్రయాణం ఓ కలలా అనిపిస్తోంది. నన్ను నమ్మి మంచి అవకాశాల్ని ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు' డ్రీమ్ రోల్.. "పోలీస్ రోల్ చేయాలనేది నా డ్రీమ్. కెరీర్ తొలినాళ్లలోనే ఆ ఛాన్స్ దక్కింది. పాత్ర కోసం రిఫరెన్స్ ఏమీ తీసుకోలేదు. మా నాన్న ఆర్మీ ఆఫీసర్. వారి బాడీ లాంగ్వేజ్‌పై నాకు అవగాహన ఉంది. దాన్ని దృష్టిలో పెట్టుకుని కొంత హోమ్ వర్క్ చేశా. వెంకటేశ్ సర్ మంచి వ్యక్తి. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉంటారు. కామెడీ టైమింగ్ బాగుంటుంది. ఐశ్వర్య మంచి నటి. ఆమె నటించిన సినిమాలు చూశా. పాజిటివ్‌గా ఉంటారు. తన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా"

## కరుణ్ నాయర్ పరుగుల వరద..
## 'అజేయంగా' ప్రపంచ రికార్డు బ్రేక్



భారత్ తరపున టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ చేసిన కరుణ్ నాయర్ జట్టుకు దూరమై చాలాకాలమే అయింది. అయితే, ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీ లో 33 ఏళ్ల కరుణ్ నాయర్ పరుగుల వరద పారిస్తున్నాడు.విదర్భ కెప్టెన్‌గా ఉన్న అతను సెంచరీల మోత మోగిస్తున్నాడు. ఇప్పటికే వరుసగా రెండు శతకాలు బాదిన అతను.. ఇవాళ (జనవరి 3) ఉత్తర్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ (112బీ 101 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) మూడంకెల స్కోరు సాధించి హ్యాట్రిక్ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలోనే ఓ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి కాసేపటికే ఔటయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌తో కరుణ్ నాయర్ లిస్ట్ ఎ క్రికెట్‌లో నాటౌట్‌గా నిలుస్తూ అత్యధిక పరుగులు (542) చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు జేమ్స్ ఫ్రాంక్లిన్ (527) పరుగులు పేరిట ఉండేది.గత నాలుగు మ్యాచ్‌ల్లో కరుణ్ నాయర్ నాటౌట్‌గా నిలిచాడు. జమ్మూ కాశ్మీర్‌పై (112లిబీ 108 బంతుల్లో), ఛత్తీస్‌గఢ్‌పై (44లి), చండీగఢ్‌పై (163లిబీ 107 బంతుల్లో), తమిళనాడుపై (111లిబీ 103 బంతుల్లో) పరుగుల వరద పారించాడు. దీంతో విదర్భ ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. కరుణ్ 2016లో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టులో ట్రిపుల్ సెంచరీ బాదిన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో గత రెండు సీజన్లలో అన్‌సోల్డ్‌గా ఉండగా.. ఇటీవల ముగిసిన మెగా వేలంలో రూ.50 లక్షలకు దిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది.

## ప్రభ్‌సిమ్రన్ సింగ్ హ్యాట్రిక్ సెంచరీ..
## పంజాబ్ అరుదైన రికార్డు



టీమ్‌ఇండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న పంజాబ్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ విజయ్ హజారే ట్రోఫీ లో దుమ్మురేపుతున్నాడు.హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ప్రభ్‌సిమ్రన్ (137బీ 105 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతక్కొట్టాడు. ఇది అతడికి వరుసగా మూడో సెంచరీ కావడం విశేషం. గత రెండు మ్యాచ్‌ల్లో.. ముంబయిపై (150లి), సౌరాష్ట్రపై (125) సెంచరీలు బాదాడు. హైదరాబాద్‌తో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (93బీ 72 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) కూడా అదరగొట్టాడు. అభిషేక్, ప్రభ్‌సిమ్రన్ జోడీ తొలి వికెట్‌కు 196 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. రమణ్‌దీప్ సింగ్ (80బీ 53 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా దంచికొట్టాడు. అన్మోల్‌ప్రీత్ (46), నేహల్ వధేరా (35) పరుగులు చేశారు. దీంతో పంజాబ్ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 426 పరుగులు చేసింది. ఈ క్రమంలోనే విజయ్ హజారే ట్రోఫీలో ఒకే సీజన్‌లో రెండు సార్లు 400 పైచిలుకు స్కోరు చేసిన తొలి జట్టుగా పంజాబ్ రికార్డు సృష్టించింది.427పరుగుల లక్ష్యఛేదనలో హైదరాబాద్ 346 రన్స్‌కు ఆలౌటైంది. కె నితీశ్ రెడ్డి (111) శతకం బాదాడు. తనయ్ త్యాగరాజన్ (74) రాణించాడు. గత మ్యాచ్‌లో పంజాబ్.. సౌరాష్ట్రపై 424/5 స్కోరు చేసిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో అభిషేక్ (170బీ 96 బంతుల్లో 22 ఫోర్లు, 8 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 425 పరుగుల లక్ష్యఛేదనలో సౌరాష్ట్ర 367 పరుగులకు ఆలౌటైంది.24 ఏళ్ల ప్రభ్‌సిమ్రన్ ఐపీఎల్‌లోనూ పంజాబ్‌కే ఆడాడు. గత రెండు సీజన్లలో మెరుగైన ప్రదర్శన చేసి జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. 2023 సీజన్‌లో ఓ సెంచరీ కూడా చేశాడు. దీంతో 2025 సీజన్‌కు ముందు నిర్వహించిన మెగా వేలానికి ముందు ఇతడిని రూ.4 కోట్లకు పంజాబ్ రిటైన్ చేసుకుంది.

## సిడ్నీ టెస్టు.. రికార్డు స్థాయిలో
## పోటెత్తిన అభిమానులు



ప్రస్తుతం భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్– గావస్కర్ ట్రోఫీ కి ప్రేక్షకుల నుంచి మునుపెన్నడూ లేనంత ఆదరణ దక్కుతోంది.ప్రతి మ్యాచ్‌కూ అభిమానులు పోటెత్తుతున్నారు. సిరీస్ నిర్ణయాత్మక ఐదో టెస్టు సిడ్నీ వేదికగా జరుగుతోంది. ఈ స్టేడియం కెపాసిటీ 48,000 కాగా.. ఐదో టెస్టు తొలి రోజు టీ విరామ సమయానికి 47,566 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. ఈ మైదానంలో ఆసీస్, భారత్ మధ్య జరిగిన టెస్టు మ్యాచ్‌ల్లో తొలి రోజు ఇదే అత్యధిక హాజరు కావడం విశేషం. అంతేకాదు 1976 నుంచి సిడ్నీలో మొదటి రోజు ఆటకు ఇంత భారీ స్థాయిలో ప్రేక్షకులు రావడం ఇదే తొలిసారి అని క్రికెట్ ఆస్ట్రేలియా పేర్కొంది.ఇక్కడ జనవరి, 2004లో ఆసీస్, టీమ్‌ఇండియా మధ్య జరిగిన టెస్టుకు ఫస్ట్ డే 44,901 మంది హాజరయ్యారు. జనవరి, 2007లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన యాషెస్ టెస్టు ఐదో రోజు ఆటను రికార్డు స్థాయిలో 46,070 మంది వీక్షించారు. భారత్, ఆసీస్ మధ్య ఐదో టెస్టుతో ఈ రెండు రికార్డులు బ్రేక్ అయ్యాయి. మెల్‌బోర్న్‌లో ఇటీవల ముగిసిన బాక్సింగ్ డే టెస్టుకు కూడా అభిమానులు పోటెత్తారు. ఈ మ్యాచ్‌కు తొలి రోజు 87,242, రెండో రోజు 85,147, మూడో రోజు 83,073, నాలుగో రోజు 43,867, ఐదో రోజు 74,362 మంది ప్రేక్షకులు వచ్చారు. దీంతో ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలోనే అత్యధిక మంది (3,73,691) వీక్షించిన మ్యాచ్‌గా రికార్డు సృష్టించింది. ఈ క్రమంలోనే 87 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టింది. 1937లో ఆరురోజులపాటు జరిగిన యాషెస్ టెస్టును 3,50,534 మంది వీక్షించారు.ఇక, ఆస్ట్రేలియా, భారత్ మధ్య ఐదో టెస్టు విషయానికొస్తే.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 185 పరుగులకు ఆలౌటైంది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ ఒక వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది. సామ్ కొన్‌స్టాస్ (7లి) క్రీజులో ఉన్నాడు.